# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :204 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: సోమవారం 20-10-2025 | పేజీలు:4 వెల: 2.00


### బిసి రిజర్వేషన్లు సాధించి తీరుతాం

ఖమ్మం,కులగణన ఆధారంగా బీసీల రిజర్వేషన్ల కోసం శాసనసభలో అన్ని పార్టీల ఆమోదం తీసుకొని హైకోర్టు, సుప్రీంకోర్టు ద్వారా న్యాయం కోసం ముందుకెళ్లామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. సత్తుపల్లిలో చేపట్టిన బీసీ బంద్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజల మనోభావాలకు తగ్గట్టుగా రాజ్యాంగబద్ధంగా అందరికీ సమన్యాయం జరిగి, రాజ్యాధికారం కల్పించాలనేదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్దేశమని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర చేపట్టారని మంత్రి తుమ్మల గుర్తు చేశారు.అందరికీ విద్యా, ఉద్యోగం కల్పించాలనే గొప్ప సామాజిక విప్లవం కోసం రాహుల్ గాంధీ మేనిఫెస్టో రూపొందించారని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. కొద్ది తేడాతో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాలేక పోయిందని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలకు ఇచ్చిన మాట ప్రకామరమే.. బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలతోనే చట్టం చేశామని పేర్కొన్నారు.

# తెలంగాణకు తాళం.. సర్వత్రా బంద్!



హైదరాబాద్,తెలంగాణకు తాళం పడింది. సర్వత్రా బంద్ ప్రభావం కనిపిస్తోంది. ప్రభుత్వ పార్టీ కాంగ్రెస్ కూడా బంద్‌కు మద్దతు తెలపడంతో అన్ని వ్యవస్థలు నిలిచిపోయాయి. ఒక్క అత్యవసర, పోలీసు, ఫైర్ డిపార్ట్‌మెంట్, వైద్యం తప్ప.. ఇతర వ్యవస్థలన్నీ.. బంద్ కారణంగా ఆగిపోయాయి. ఆర్టీసీ బస్సులు కూడా రోడ్డెక్కలేదు. దీంతో సామాన్యుల జీవనం నరక ప్రాయంగా మారిందని పరిశీలకులు చెబుతున్నారు. రోజువారీ వేతనంపై జీవించే కుటుంబాలకు ఇబ్బంది ఏర్పడిందని చెబుతున్నారు.మంత్రుల నుంచి నాయకుల వరకు కాంగ్రెస్ పార్టీ తరపున బంద్‌లో పాల్గొన్నారు. ఉప్పల్, రాణిగంజ్ వంటి కీలకమైన బస్టాండ్ల వద్ద బీసీ జేఏసీ నాయకులు బంద్‌ను సంపూర్ణంగా నిర్వహిస్తున్నారు. ఒక్క బస్సును కూడా బయటకు రాకుండా అడ్డుకున్నారు. అయితే.. రైలు ప్రయాణికులు బయటకు వస్తున్నా.. వారికి సరైన ప్రయాణ సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని ఆసరా చేసుకున్న ప్రైవేటు రవాణా సంస్థలు ధరలను రెట్టింపు చేశాయి.

ఎందుకీ బంద్?

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ప్రభుత్వ ఉద్దేశం. దీనికి అన్ని ప్రతిపక్ష పార్టీలూ మద్దతుగా నిలిచాయి. దీనిపై గవర్నర్ ఆమోదం తెలపకపోయినా.. సుప్రీంకోర్టు గతంలో తమిళనాడు గవర్నర్ విషయంలో ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా ప్రభుత్వం జీవో ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ.. మల్కాజిగిరికి చెందిన మాధవరెడ్డి అనే రెడ్డి సామాజిక వర్గం ఉద్యమ నేత కోర్టులను ఆశ్రయించారు. ఫలితంగా ఈ జీవో న్యాయ పరమైన వివాదంలో చిక్కుకుంది.మరోవైపు కేంద్రం పరిష్కరించాలన్న డిమాండ్ కూడా బుట్టదాఖలైంది. ఈ పరిణామాల క్రమంలో ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో బీసీలు జేఏసీగా ఏర్పడి బంద్‌కు పిలుపునిచ్చాయి. దీనికి అధికార, ప్రతిపక్ష పార్టీలు అన్నీ గుండుగుత్తగా మద్దతు తెలిపాయి. దీంతో శనివారం ఉదయం 6 గంటల నుంచే రాష్ట్రానికి తాళం పడినట్టుగా ఎక్కడి వ్యవస్థలు అక్కడే నిలిచిపోయాయి. సాయంత్రం 5 గంటల వరకు బంద్ జరగనుందని ఆర్ . కృష్ణయ్య వెల్లడించారు.

# బీసీ బంద్ వేళ తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం!..




హైదరాబాద్,బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం దిశగా అడుగులు వేస్తోందా? ఇన్నాళ్లు బహిర్గతం చేయని కులగణన సర్వే వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయబోతోందా?తాజాగా మంత్రి వాకిటి శ్రీహరి చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి. డెడికేషన్ కమిషన్ రిపోర్టును ప్రభుత్వం బయటపెట్టలేదని, నిజంగానే కాంగ్రెస్?కు చిత్తశుద్ధి ఉంటే ఈ వివరాలు బయటపెట్టేవాళ్లు కదా అని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న వేళ మంత్రి వాకిటి శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే డెడికేషన్ కమిషన్, బీసీ కమిషన్, ఎంపిరికల్ డేటా అంతా పబ్లిష్ చేస్తామన్నారు. ఇవాళ బీసీ బంద్?లో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఎంపిరికల్ డేటా వివరాలు బయటపెట్టకపోవ డానికి కొన్ని ఆంక్షలు ఉన్నాయని ఎవరూ అడ్డంకులు సృష్టించకూడదనే ఈ వివరాలు పబ్లిక్ డొమైన్?లో ఇంత కాలం పెట్టలేదన్నారు. కానీ కోర్టుల్లో సమర్పించిన వివరాలతోనే ఇన్ని అడ్డంకులు సృష్టిస్తున్నారని చెప్పారు. మా చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం ఎవరికీ లేదన్నారు.

బీఆర్ఎస్ లా కాదు:

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేతోనే తెలంగాణలో బీసీల లెక్కలు తేలాయని వాకిటి శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లు ఇవ్వదని బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీకి నష్టం అని తెలిసినా కాంగ్రెస్ రాష్ట్ర విభజన చేసిందని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ ఉద్యోగాలు ఇచ్చినట్లే ఇచ్చి కోర్టుకు వెళ్లినట్లు తాము బీసీ రిజర్వేషన్ల విషయంలో చేయడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విచారణకు స్వయంగా డిప్యూటీ సీఎం, బీసీ మంత్రులం హాజరయ్యామని ఇలాంటిది చరిత్రలో ఎక్కడైనా జరిగిందా? అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు, సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నామన్నారు. బీసీలకు న్యాయం జరిగే ఇంత మంచి అవకాశం మళ్లీ మళ్లీ రాదని మంత్రినై ఉండి కూడా రెండు రోజుల పాటు తాను హైకోర్టులోనే ఉన్నానని చెప్పారు. కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లాల్సింది కాదని ఈ అంశాన్ని బీసీ రిజర్వేషన్లకు ముడిపెట్టవద్దన్నారు. ఇది వేరే విషయం అని ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చూసుకుంటున్నారని చెప్పారు. కొండా సురేఖ అంశాన్ని చూపుతూ బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తక్కువ చేయొద్దన్నారు.

కులగణన వివరాల కోసం ప్రతిపక్షాల డిమాండ్:

రాష్ట్ర ప్రభుత్వం ప్లానింగ్ శాఖ ద్వారా నిర్వహించిన కులగణన లెక్కల కోసం ప్రతిపక్షాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. కులగణన వివరాలు బయటపెట్టాలని కోరుతున్నాయి. అయితే ప్లానింగ్ విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా పెట్టుకుని సర్వే చేశామని ఈ వివరాలతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుట్రలు పన్నాయని అధికార కాంగ్రెస్ పార్టీ చాలా కాలంగా ఆరోపిస్తోంది. కులగణన వివరాలు బహిర్గతం చేస్తే వ్యక్తుల వ్యక్తిగత ప్రైవసీకి భంగం కలుగుతుందని అందువల్లే పూర్తి వివరాలు పబ్లిక్ డొమైన్?లో ఉంచకుండా అందులోని సారాంశాన్ని మాత్రమే వెల్లడించామని వాదిస్తోంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఈ వివరాలను పబ్లిక్ డొమైన్?లో ఏమైనా ఉంచబోతోందా? వాకిటి శ్రీహరి వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనమా అనే చర్చ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతోంది. మొత్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చాలెంజ్ గా తీసుకున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎలా ముందడుగు వేయబోతోంది అనేది వేచి చూడాలి.

# కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్దరణ చేస్తాం



పాట్నా, జమ్మూ కశ్మీర్ కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ పై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తెలిపారు. కేంద్ర పాలిత ప్రాంతైన లద్దాఖ్ విషయంలోనూ ప్రజలు లేవనెత్తిన డిమాండ్లపై కూడా 'మంచి తీర్మానం' చేస్తామని హామీ ఇచ్చారు. పాట్నాలో శనివారంనాడు జరిగిన మీడియా కాంక్లేవ్‌లో హోం మంత్రి మాట్లాడుతూ, ఉగ్రవాదం గుప్పిట్లో చిక్కిన జమ్మూకశ్మీర్ 370వ అధికరణ తర్వాత యూటర్న్ తీసుకుందని, గత తొమ్మిది నెలల్లో లోకల్ టెర్రరిస్ట్ రిక్రూట్‌మెంట్ ఒక్కటి కూడా చోటుచేసుకోలేదని అన్నారు. '1990 నుంచి వేర్పాటువాద చీడపీడల్లో చిక్కుకున్న జమ్ముకశ్మీర్‌లో గుణాత్మకమైన మార్పు వచ్చింది. గతంలో సరిహద్దులకు ఆవల నుంచి టెర్రరిస్టులను పంపాల్సిన అవసరం లేదని పాక్ భావించేది. మన పిల్లల చేతుల్లో ఆయుధాలు ఉంచేది. ఇప్పుడు పరిస్థితి మారింది. జమ్మూకశ్మీర్ ప్రజలంతా తాము దేశంతో ఉన్నామని, యావత్ దేశం తమ వెంట ఉందని బలంగా విశ్వసిస్తున్నారు' అని అమిత్‌షా చెప్పారు. మ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిందని, పంచాయతీలు, మున్సిపాలిటీలతో పాటు అసెంబ్లీకి ఎన్నికలు కూడా జరిగాయని, రాజ్యసభ ఎన్నికలు కూడా త్వరలో జరగనున్నాయని అమిత్‌షా చెప్పారు. తాను సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత కూడా ఇంతవరకూ రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరగలేదంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాజకీయ అనివార్యతల వల్ల ఆయన అలా చెప్పి ఉండొచ్చని అన్నారు. కానీ రాష్ట్ర హోదా పునరుద్ధరణ సరైన సమయంలో జరుగుతుందని, సీఎంతో కూడా చర్చిస్తామని చెప్పారు. లద్దాఖ్‌లో ఇటీవల జరిగిన ఆందోళనను ప్రస్తావిస్తూ, లెహ్, కార్గిల్ కమిటీలతో కేంద్రం సంభాషణలు జరుపుతోందని చెప్పారు. ప్రజలు ఓర్పుతో ఉండాలని కోరారు. వారి న్యాయపరమైన డిమాండ్లపై మంచి తీర్మానం జరుగుతుందని వివరించారు. సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ విడుదల అవకాశాలపై అడిగినప్పుడు, ప్రజల డిమాండ్లపైనే తాను మాట్లాడుతున్నానని, వ్యక్తుల డిమాండ్ల గురించి కాదని అన్నారు. ఆయనకు (వాంగ్‌చుక్) సంబంధించిన కేసు కోర్టు ముందు ఉందని, సాక్ష్యాల ఆధారంగా కోర్టు నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

# దండుపాళ్యం బ్యాచ్ ఎవరిదో ప్రజలకు బాగా తెలుసు



హైదరాబాద్, దండుపాళ్యం పాలన ఎవరిదో అందరికీ తెలుసని, అధికారంలేదన్న అసహనంతో కేబినెట్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్గత కుమ్ములాటలు కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై కట్టుకథలు అల్లి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గత పాలనా వైఫల్యాలను దాచేందుకు మైండ్ గేమ్ ఆడుతున్నారని తెలిపారు. అవినీతి, అక్రమాలతో రాజ్యమేలిన వారు ఇప్పుడు మాపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇలా విమర్శలు చేసి, అవినీతి, అక్రమాలను దాచుకోలేరని గట్టిగా హెచ్చరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులందరిదీ ఒకటే జెండా, ఒకటే అజెండా అని, గత 20 నెలల్లో రాష్ట్రానికి రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. తమ పాలన అభివృద్ధే లక్ష్యంగా నడుస్తుందని, ఎలీ లిల్లీ లాంటి అంతర్జాతీయ కంపెనీలు తెలంగాణకు రావడం తమ కృషికి నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని అంతర్గత కుమ్ములాటల్ని కప్పిపుచ్చుకోవడానికి తమపై బురద చల్లడం మానాలని హితవు పలికారు. విజ్ఞులైన ప్రజలు మీ మైండ్ గేమ్‌లను నమ్మరని గుర్తుంచు కోవాలని, రాజకీయాలను పక్కన పెట్టి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ నేతలకు విజ్ఞప్తి చేశారు. గత ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలల్లో రూ.12, 864 కోట్ల ఎఫ్‌డీఐలు తెలంగాణకు వచ్చాయన్నారు. 33 శాతం పెరుగుదలతో దేశంలో టాప్ 3 అర్బన్ ఎఫ్‌డీఐ కేంద్రాల్లో హైదరాబాద్ ఉందని తెలిపారు. పరిశ్రమల జీఎస్‌వీఏ రూ.2.77 లక్షల కోట్లకు పెరిగిందని, ఇది జాతీయ సగటు కంటే ఎక్కువని పేర్కొన్నారు. ఇవన్నీ పట్టించుకోకుండా విమర్శలు చేస్తున్న హరీష్ రావు తదితరుల తీరుపై శ్రీధర్ బాబు మండిపడ్డారు. పదేళ్లలో చేయలేని ఎన్నో పనులను ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో తాము చేసి చూపామని అన్నారు.

# బందరు ప్రజలు మోసం చేస్తున్న మంత్రి



మచిలీపట్నం, మచిలీపట్నం ప్రజలతో మంత్రి కొల్లు రవీంద్ర ఆటలాడుతున్నాడని వైసీపీ నేత పేర్నినాని అన్నారు. కొల్లు రవీంద్ర స్వార్ధం కోసం జనంతో ఆటలాడుతున్నారు.. 13వ తేదీన మున్సిపల్ అధికారులతో ఒక నోటీస్ ఇప్పించారు.. జూలైలోనే మున్సిపల్ అధికారులతో కొల్లు రవీంద్ర ఓ ప్లాన్ ను రెడీ చేసుకున్నారు.. బెల్లపుకోట్ల సందును నేను మొదటి సారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే విస్తరణ చేశా.. 2014లో మంత్రిగా ఉన్నప్పుడు రోడ్డు విస్తరణ చేయాలనే ఆలోచన రాలేదు.. రోడ్డు విస్తరణపై పేపర్లో వచ్చే వరకూ ఎవరికీ తెలియదు.. హడావిడిగా పేపర్ ప్రకటనపై మచిలీపట్నం ప్రజల్లో ఆందోళన మొదలైంది.. రూ. 10 కోట్లతో మిల్లు, 20 కోట్లతో కమర్షియల్ కాంప్లెక్స్, 5 కోట్లతో గెస్ట్ హౌస్ కడుతున్నాడు.. కొల్లు రవీంద్ర చేపట్టే ఒక్క నిర్మాణానికీ ప్లాన్లు లేవు.. చిన్నచిన్న వారిపై ప్రతాపం చూపించే మున్సిపల్ కమిషనర్ కు కొల్లు రవీంద్ర నిర్మాణాలు కనిపించలేదా అని మాజీ మంత్రి పేర్నినాని ప్రశ్నించారు.ఇక, ప్లాన్లు లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే ముడా కళ్లు మూసుకుందా అని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్నినాని ప్రశ్నించారు. మంత్రి కొల్లు రవీంద్ర అండ చూసుకుని మున్సిపల్ కమిషనర్ రెచ్చిపోతున్నాడు.. సామాన్యులు ఇల్లు కట్టుకుంటుంటే మున్సిపల్ సిబ్బంది వాలిపోతున్నారు అని ఆరోపించారు. స్థానిక టీడీపీ ఇంఛార్జ్ లకు కమిషన్ ఇస్తేనే అనుమతులు ఇస్తున్నారు.. నువ్వు మీ ఇంఛార్జిలకు ఎంత కమిషన్ ఇచ్చావ్ కొల్లు రవీంద్ర.. బడ్డీ కొట్లు కూలగొట్టించి నీ ఇంఛార్జిలకు కమిషన్లు ఇప్పించి మళ్లీ అక్కడే షాపులు పెట్టించావ్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లు రవీంద్ర కడుతున్న కమర్షియల్ కాంప్లెక్స్ కు కనీసం ఎలాన్ లేదు.. తన కాంప్లెక్స్ ఎలాన్ కోసం రోడ్డును విస్తరణ చేయిస్తున్నాడు.. చంద్రబాబు, లోకేష్ ఆశ్చర్యపోయే స్థాయిలో కొల్లు రవీంద్ర ఆస్తులు పోగేశాడు అని పేర్నినాని ఆరోపించారు.

# బీసీ బంద్ లో కవిత డ్రామా..? మానవహారం సక్సెసా..?



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో కొన్ని రోజులుగా కవిత గురించి ఎక్కువగా వినిపిస్తోంది. పార్టీ నుంచి వెలివేయబడ్డ ఆమె మేనబావ, కజిన్ పై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్ పార్టీని వీడారు. 'కేసీఆర్ నాకు మెంటర్.. ఆయన ఆదర్శంతోనే పని చేస్తా.. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటా' అంటూ చెప్పి పార్టీ నుంచి బయటకు వచ్చిన కవిత సొంత పార్టీ పెడతానని ప్రకటించారు. కానీ ఆ దిశగా ఎటువంటి పురోగతి సాధించలేదు. కానీ తను కలిసి నడిచిన తెలంగాణ జాగృతినే పార్టీగా అనౌన్స్ చేస్తుందని ఆమె అనుచరులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని కార్యక్రమాలు చేపడుతున్నారు. 'జాగృతి జనం బాట' అనేక కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు. దీని ద్వారా ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటానని ప్రకటించారు. దీని కోసం తాను కేసీఆర్ ఫొటోను వాడుకోనని మరో సారి సంచలన కామెంట్లు చేశారు.ఇది ఇలా ఉంటే.. ఆమె బీసీ రిజర్వేషన్ కు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ జరిగి తీరాలని ఈ విషయంలో తాను కాంగ్రెస్ తో కలిసి నడుస్తానని చెప్పారు. శనివారం, అక్టోబర్ 18న కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీసీ బంద్ కు మద్దతిచ్చారు. ఇందులో భాగంగా ఆమె పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు కనిపిస్తుంది. సోషల్ మీడియాలో హైప్ కూడా పెంచుకుంటున్నారు. సోషల్ మీడియాలో తీవ్రమైన దుమారం రేపుతున్నారు.బీసీ బంద్ కు కల్వకుంట్ల కవిత ఆటో ర్యాలీ తీయబోతున్నారని, ఖైరతాబాద్ చౌరస్తాకు పెద్ద ఎత్తున ఆటోలతో చేరుకుంటుందని, వేలాది ఆటోలతో జనం ఊహించని విధంగా రాబోతున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. ఆమె కూడా ఆటో ర్యాలీ నిర్వహించి ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేసింది. తన పార్టీ తరుపున నిర్వహించని మానవ హారంలో కార్యకర్తలు, ఫాలోవర్స్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలతో కల్వకుంట్ల కవిత రాజకీయంగా తెలంగాణలో గుర్తింపు దక్కించుకోవాలని చూస్తోంది. ఆమె కార్యక్రమాలపై ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే 'లిక్కర్ క్వీన్' అనే నిందమోస్తున్న కల్వకుంట్ల కవిత తను పార్టీ పెడితే జనంలోకి ఏ మేరకు వెళుతుందన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. అయితే కొందరు మాత్రం ఆమె పార్టీ పెట్టదు చివరికి మళ్లీ బీఆర్ఎస్ గూటికే చేరుతుందని అంటున్నారు. ఇలాంటి కార్యక్రమాలతో తన ఫాలోవర్స్ ను పెంచుకోవాలని వ్యూహాలు రచిస్తుందని ఆమె వ్యతిరేకులు చెప్పుకుంటున్నారు.ఏది ఏమైనా ఆమె కార్యక్రమాల పట్ల ప్రజలు ఎక్కువగా ఇంట్రస్ట్ చూపించడం లేదని తెలుస్తోంది. ఖైరతాబాద్ లో పెద్ద ఎత్తు మానహారం అన్నారు. కానీ అది అంత సక్సెస్ కాలేదు. పైగా తన కొడుకును కూడా ఇందులో పాల్గొనేలా చేసి తన వైపునకు అటెన్షన్ తిప్పుకోవడంలో మాత్రం కొంచెం సక్సెస్ అయ్యారు.

# కల్తీమద్యం సూత్రధారులను వదిలేది లేదు



అమరావతి,కల్తీ మద్యంలో సూత్రధారులు, పాత్రధారులందరికీ చుక్కలు చూపిస్తామని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఈ విషయంలో ప్రభుత్వం వెనక్కి పోదని, కఠిన చర్యలు తప్పవని కూడా అన్నారు. మద్య నిషేధం అమలు చేశాకే 2024లో ఓట్లు అడుగుతామని చెప్పి.. కల్తీ మద్యం అమ్మిన నీచ చరిత్ర వైకాపాదని ధ్వజమెత్తారు. పేర్ని నానికి మతి భ్రమించి ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదన్నారు. రూ.99 బ్రాండ్లు నిలిపివేశామనడం అతని అజ్ఞానానికి నిదర్శనమని దుయ్యబట్టారు. డిజిటల్ పేమెంట్లు ఎవరి హయాంలో లేకుండా చేశారో ప్రజల్ని అడిగితే చెబుతారన్నారు. ఇండెంట్ ప్రకారమే మద్యం సరఫరా చేస్తారనే కనీస జ్ఞానం లేదా?అని ప్రశ్నించారు. గత ఐదేళ్లు కల్తీ మద్యం అమ్మిందెవరో ప్రజలు గుర్తించే వైకాపాను తరిమికొట్టారని తెలిపారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం ఘటనల విచారణ పారదర్శకంగా జరుగుతోందని వెల్లడించారు. సిట్ విచారణను కూడా తప్పుదోవ పట్టించేలా వైకాపా సోషల్ మీడియా కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా నేతల ప్రోత్సాహంతోనే కల్తీ మద్యం తయారు చేసినట్లు జనార్ధనరావు అంగీకరించాడన్నారు. ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకే కల్తీ మద్యం తయారు చేసినట్లు అంగీకరించాడని వ్యాఖ్యానించారు. హోలోగ్రామ్, ట్రాక్ అండ్ ట్రేస్ విధానం 2014-19లోనే తీసుకొచ్చామని గుర్తు చేశారు.

### బిసి బిల్లు కోసం త్వరలో మోడీని కలుస్తాం: పిసిసి చీఫ్

హైదరాబాద్,బీసీ బంద్‌లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట్ చౌరస్తా దగ్గర నిర్వహించిన ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంద్ విజయవంతమైందని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారని తెలిపారు.బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏ పార్టీకి లేదు. కుల సర్వే చేశాం. జీవో ఇచ్చాం. బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రధాని మోదీని కలుస్తాం. ప్రభుత్వ పరంగా 42 శాతంతో ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నాం. సాధ్యాసాధ్యాలు పరిశీలించిన తర్వాత స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటాం అని పేర్కొన్నారు.

## సంపాదకీయం

**సోమవారం 20-10-2025**

# డిజిటల్ భారత్‌కు క్వాంటమ్ భద్రత

అస్త్రం మంచిదైనా, దాన్ని ఎలా వాడతాం అనేదే ఫలితాన్ని నిర్ణయిస్తుంది. క్వాంటమ్ కంప్యూటింగ్ కూడా అలాంటిదే! ప్రస్తుతం ప్రపంచం క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని అవకాశాలపై పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తోంది. ఇందులో ప్రయోజనాలతోపాటు సవాళ్లు కూడా ఉన్నాయి. వాటిని ముందుగానే గుర్తించి, పరిష్కార మార్గాలను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మనం రోజూ చేసే యూపీఐ లావాదేవీలు సురక్షితంగా పూర్తవడం, ఆధార్ వివరాలు భద్రంగా ఉండటం, వాట్సాప్ సందేశాలు ఇతరులు చదివే అవకాశం లేకపోవడం... ఇవన్నీ ఆర్ఎస్ఏ, ఈసీసీ వంటి క్రిప్టోగ్రఫీ అల్గారిథమ్స్ వల్లే సాధ్యమవుతున్నాయి. ఇలాంటి రక్షణ లేకపోతే వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీలు, దేశ భద్రత అన్నీ ప్రమాదంలో పడతాయి. ఇలాంటి అల్గారిథమ్స్‌ను ఛేదించడానికి సూపర్ కంప్యూటర్లకే చాలా సంవత్సరాలు పడుతుందని అంచనా. అయితే రాబోయే పదేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్లు ఈ క్రిప్టోగ్రఫీ అల్గారిథమ్స్‌ను కొన్ని నిమిషాల్లోనే ఛేదించే స్థాయికి చేరవచ్చునేది నిపుణుల భావన. ఇది భారత డిజిటల్ వ్యవస్థకే తీవ్ర ముప్పుగా పరిణమించవచ్చు.

సేకరించి పెట్టుకుంటున్నారు!

హ్యాకర్లు, ఆర్థిక నేరగాళ్లు, గూఢచార నెట్‌వర్క్‌లు ఇప్పటికే సున్నితమైన సమాచారాన్ని సేకరించి భద్రపరుస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో క్వాంటమ్ కంప్యూటర్లు సిద్ధమైనప్పుడు ఆ డేటాను వారు సులభంగా ఛేదించి ఇష్టమొచ్చినట్లు వాడుకోగలరు. ఈ విధానాన్నే 'హార్వెస్ట్ నౌ, డీక్రిప్ట్ లేటర్ (హెచ్ఎన్‌డీఎల్)' అని పిలుస్తారు. అంటే ఇప్పుడు డేటాను సేకరించి పెట్టుకుని, తరవాత ఛేదించడం. ఆరోగ్య రికార్డులు, ఆధార్ వివరాలు, రక్షణ సమాచారం, ఆర్థిక లావాదేవీలు, ఔషధ పరిశోధన, మేధోసంపత్తి వంటి సున్నితమైన డేటాకు ఇది తీవ్రమైన ముప్పే. అందుకే పోస్ట్-క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ (పీక్యూసీ)పై ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలి. పీక్యూసీ అనేది కొత్త గణిత పద్ధతుల సమాహారం. కేవలం ప్రస్తుత కంప్యూటర్ల దాడులను మాత్రమే కాకుండా, భవిష్యత్తులో వచ్చే క్వాంటమ్ దాడులను కూడా తట్టుకోగల భద్రతా విధానమిది. పీక్యూసీ కోసం కొత్త యంత్రాలు, హార్డ్‌వేర్ అవసరం లేదు. ఇప్పటి మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లు, సర్వర్లు, క్లౌడ్ ప్లాట్‌ఫారాలపైనే సులభంగా అమలు చేయవచ్చు. అమెరికా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఐఎస్‌టీ) 2022లో పీక్యూసీలో భాగంగా ఎన్‌క్రిప్షన్ కోసం 'కైబర్', డిజిటల్ సిగ్నేచర్‌ల కోసం 'డిలిథియం' అనే రెండు ప్రధాన అల్గారిథమ్స్‌ను ప్రమాణాలుగా ఎంచుకుంది. గూగుల్, మైక్రోసాఫ్ట్‌వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే ఈ కొత్త పద్ధతులను పరీక్షించి తమ సేవల్లో ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటర్లు ప్రస్తుత క్రిప్టోగ్రఫీని ఛేదించకుండా రక్షించడమే పీక్యూసీ లక్ష్యం. దాదాపు అన్ని రంగాలు ఇప్పుడు ఎన్‌క్రిప్షన్‌పై ఆధారపడుతున్నాయి. ఆరోగ్య, ఔషధ రంగం, బ్యాంకులు, ఫిన్‌టెక్, టెలికాం, ఇంటర్నెట్ సేవలు, రక్షణ, అంతరిక్ష రంగాలు, ఎనర్జీ, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలైన ఆధార్, డిజిలాకర్, జీఎస్‌టీ వంటి వేదికలు... ఇలాంటివన్నీ క్వాంటమ్ ముప్పు బారినపడేందుకు అవకాశమున్న కీలక రంగాలుగా చెప్పవచ్చు. 'హార్వెస్ట్ నౌ, డీక్రిప్ట్ లేటర్' ప్రమాదం దృష్ట్యా, ఈ రంగాల్లోని సంస్థలు తమ డేటా నిల్వ విధానాలు, సెక్యూరిటీ సర్టిఫికెట్లు, ఎన్‌క్రిప్షన్ సిస్టమ్స్‌ను తక్షణం సమీక్షించుకోవాలి. పీక్యూసీకి అనుకూలంగా ఉండే మార్పులను ప్రారంభించాలి. క్వాంటమ్-సేఫ్ సిస్టమ్స్‌గా మారాలి. కేవలం భద్రత కోసమే కాదు, దేశ భవిష్యత్ డిజిటల్ స్వావలంబనకు కూడా ఇదో వ్యూహాత్మక అవసరం. ఒక్కసారిగా మార్పులు సాధ్యం కాకపోయినా- ప్రణాళికలు రూపొందించడం, పైలట్ ప్రాజెక్టులు చేపట్టడం వంటి దశల్లో పీక్యూసీని అమలుచేయాలి. ఈ ఏడాదికల్లా ప్రభుత్వ సంస్థలు తమ క్రిప్టోగ్రఫీ సిస్టమ్‌లను సమీక్షించి, పీక్యూసీకి మైగ్రేట్ అయ్యే ప్రక్రియను ప్రారంభించాలని అమెరికా సర్కారు ఆదేశించింది. ఐరోపా, చైనా కూడా పీక్యూసీలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నాయి. 2035 నాటికి పూర్తిస్థాయి పీక్యూసీ మైగ్రేషన్ సాధించాలనే లక్ష్యంతో బ్రిటన్ స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది.

ఇండియాకు అవకాశం

క్వాంటమ్ యుగం ప్రపంచానికి కొత్త ప్రమాదాలను తెస్తున్నా, ఇండియాకు ఇదొక అపూర్వ అవకాశంగానే భావించాలి. వై2కే సంక్షోభ సమయంలో భారత ఐటీ రంగం ప్రపంచానికి నమ్మకమైన పరిష్కార భాగస్వామిగా నిలిచింది. అదేవిధంగా పీక్యూసీ అమలు, ఆడిటింగ్, సర్టిఫికేషన్, క్వాంటమ్ భద్రతా సేవలు వంటి రంగాల్లో ఇండియా తిరిగి నాయకత్వం వహించే సమయం ఆసన్నమైంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, బ్యాంకులు, టెక్ సంస్థలు పీక్యూసీ మార్పు కోసం నిపుణులను, సలహాదారులను అన్వేషిస్తున్నాయి. ఇదంతా లక్షల కోట్ల రూపాయల విలువైన మార్కెట్ అవకాశాలను సృష్టిస్తుంది. భారత ఇంజినీర్లు, స్టార్టప్‌లు, సైబర్ సెక్యూరిటీ సంస్థలు ఈ సాంకేతిక విప్లవానికి కేంద్రబిందువుగా మారవచ్చు. ఇండియా ఇప్పటికే క్వాంటమ్ యుగానికి సంసిద్ధమవుతోంది. జాతీయ స్థాయిలో డీఎస్టీ, నేషనల్ క్వాంటమ్ మిషన్ (ఎన్‌క్యూఎం)లు పరిశోధన, శిక్షణ, పరిశ్రమ భాగస్వామ్యాలను వేగవంతం చేస్తున్నాయి. ఏఐసీటీఈతో పాటు మద్రాస్, తిరుపతి, బెంగళూరు, కాన్పూర్ ఐఐటీలు క్వాంటమ్ విద్యను బలోపేతం చేస్తున్నాయి. అమరావతి క్వాంటమ్ వ్యాలీ, బెంగళూరులోని క్వాంటమ్ సిటీ వంటివి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. తెలంగాణ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర కూడా క్వాంటమ్ వ్యాలీలు, టెక్ పార్క్‌లను ప్రతిపాదిస్తూ ఈ ప్రణాళికలో భాగమవుతున్నాయి. అమరావతి క్వాంటమ్ వ్యాలీ భారత క్వాంటమ్ గేట్‌వేగా రూపుదిద్దుకుంటోంది. దేశంలోనే అతిపెద్ద క్వాంటమ్ టెస్ట్‌బెడ్, శిక్షణా కేంద్రం, గ్లోబల్ ప్రమాణాల కేంద్రంగా అమరావతి వ్యాలీ అవతరించబోతోంది. మొత్తమ్మీద ఇండియా 'క్వాంటమ్ నేషన్' వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యా రంగాలు సమన్వయంతో సాగితేనే 'క్వాంటమ్ సేఫ్ భారత్' సాకారమవుతుంది.

# కాలుష్యం నిజం రాజకీయం తథ్యం.. పీసీబీ చర్యలు మిథ్య!




హైదరాబాద్,చట్టాలెన్ని ఉన్నా, ప్రభుత్వ వ్యవస్థలు ఎన్ని పనిచేసినా కాలుష్యకారక పరిశ్రమల ఆగడాలకు అడ్డు పడటం లేదు. సహజ వనరులను యథేచ్ఛగా తవ్వేస్తూ వేల కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, పంట భూములు నాశనమవుతున్నాయని, గాలి కాలుష్యంతో అల్లాడుతున్నామని ప్రజలు నెత్తీనోరూ బాదుకుంటున్నా.. సంబంధిత అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు. అలాంటి కాలుష్య పరిశ్రమలకు స్థానిక రాజకీయ నాయకుడే అండదండలందిస్తున్నాడన్న చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ వ్యవస్థలు చర్యలు తీసుకునే సాహసం సంగతి పక్కన పెట్టి.. కంపెనీ యజమానులు ఇచ్చే ఆమ్యామ్యాలు జేబులో వేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నామమాత్రమని, నడిపించేది మొత్తం స్థానిక నాయకులేనని ఒక ప్రభుత్వ అధికారి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రంలో బల్క్ డ్రగ్ పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, సిమెంట్ కంపెనీలు, రసాయన పరిశ్రమలు లెక్కకు మించి ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ భూగర్భ జలాలను వినియోగించలేని దుస్థితి ఎదురవుతున్నది. సూరారం, పటాన్ చెరు వంటి పారిశ్రామికవాడల్లో తిరిగితే.. కాలుష్యం తీవ్రత ఎంత భయంకరంగా ఉందో సుస్పష్టమవుతుంది. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) తొలగింపుతో కాలుష్య కారక కంపెనీల బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బల్క్ డ్రగ్ పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, సిమెంట్ కంపెనీలు ఒకప్పుడు దిన దిన గండంగా నడిచేవి. ఇప్పుడు అవి రాష్ట్ర రాజకీయ నాయకులను శాసించే స్థాయికి ఎదిగాయన్న అభిప్రాయాలు లేకపోలేదు. ఇటీవల అరబిందో ఫార్మా కంపెనీపై జడ్చర్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే జే అనిరుధ్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. హానికర వ్యర్థ జలాలను సమీపంలోని చెరువులు, కుంటల్లోకి వదిలేస్తున్నారని, శుద్ధి చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీ పీసీబీ) అధికారులు చర్యలు తీసుకోకపోతే, తానే స్వయంగా వెళ్లి కంపెనీని తగులబెడ్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే హెచ్చరికతో మహబూబ్ నగర్ జిల్లా పీసీబీ అధికారులు మరుసటి రోజు కంపెనీకి వెళ్లి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కానీ ఇంత వరకు నమూనాలో వెల్లడైన వివరాలను అధికారికంగా ప్రకటించలేదు. లోపల ఏమైనా ఒప్పందలు జరిగాయా? ఆమ్యామ్యాలు ఏమైనా ముట్ట చెప్పారా? అనేది తెలియడం లేదని స్థానిక ప్రజలు సైతం చర్చించుకుంటున్నారు. మరో జిల్లాలో కూడా లెక్కలేనన్ని సిమెంట్ కంపెనీలు, ఫార్మా కంపెనీలు ఉన్నాయి. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఒక ఫార్మా కంపెనీ వేల కోట్ల రూపాయల విలువైన ఔషధాలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నది.

ఆ కంపెనీ ప్రాంగణంలోకి వెళ్లడానికి పీసీబీ అధికారులే వణికిపోతారని స్థానికులు చెబుతున్నారు. తనిఖీలకు వస్తున్నట్టు సమాచారం అందిన వెంటనే కంపెనీ యాజమాన్యం వెంటనే పై స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తుందని, వెంటనే పై స్థాయి అధికారి ఫోన్ చేసి, వెళ్లాల్సిన అవసరం లేదంటూ హూంకరిస్తారని చర్చించుకుంటున్నారు. సిమెంట్ కంపెనీలు నదీ జలాలను కలుషితం చేస్తున్నా చోద్యం చూడ్డం తప్ప ఏమీ చేయలేకపోతున్నామని పీసీబీ అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. వీళ్లందరూ స్థానిక నాయకుడి చేతిలో ఉంటారని, ఏ ఒక్క ప్రభుత్వ అధికారిని లోనికి రానివ్వరని స్థానికులు అంటున్నారు. ఒకవేళ అడుగు పెడితే కొద్దిరోజుల్లోనే అక్కడి నుంచి బదిలీ అయిపోతారని లేదంటే ఏసీబీ అధికారులకు చిక్కుతారని అంటున్నారు. స్థానిక నాయకుడి ప్రోద్బలం, అండదండలతోనే కంపెనీలు నడుస్తున్నాయని, వారికి కావాల్సిన వాటిని ఎప్పటికప్పుడు సమకూర్చుతారని సమాచారం. కొన్ని కంపెనీల్లో స్లీపింగ్ పార్టనర్‌గా కూడా ఉన్నట్టు తెలుస్తున్నది. ఎన్నికల సమయంలో నిధులు మొత్తం సమకూర్చుతారని, ఆయన జేబులో నుంచి ఒక్క పైసా తీయకుండా చూసుకుంటారని అంటున్నారు. ఇంట్లో జరిగే ఫంక్షన్లు, కార్యాలు, విదేశీ పర్యటనలకు కూడా మొత్తం ఖర్చు ఈ కంపెనీ యాజమాన్యాలు భరిస్తాయని చెప్పుకొంటున్నారు. ఎవరైనా గెస్టులు వస్తే తమ గెస్టు హౌసులలో విందులు కూడా ఏర్పాటు చేసే బాధ్యతలు తీసుకుంటాయని తెలుస్తున్నది. ఈ స్థాయిలో సపర్యలు చేసిన తరువాత స్థానిక నాయకుడు ఆ కంపెనీ వైపు ప్రభుత్వ అధికారులు కన్నెత్తి చూడకుండా తమ పలుకుబడిని ఉపయోగిస్తున్నారని సమాచారం. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ఫండ్స్‌ను కూడా కొందరు జిల్లా కలెక్టర్లు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తమ ఇంటి గృహోపకరణాలు, ఫర్నీచర్ కోసం వినియోగిస్తున్నారని తెలుస్తున్నది. ఉన్నత లక్ష్యం కోసం ప్రారంభించిన సీఎస్ఆర్ అధికారుల చేత చిక్కి.. తన లక్ష్యాన్ని కోల్పోతున్నదని చర్చించుకుంటున్నారు.

# మావోయిస్టు శిబిరంలో ప్రకంపనలు..పార్టీని కుదిపేస్తున్న లొంగుబాట్లు



హైదరాబాద్, మావోయిస్టు పార్టీలో నెలకొన్న ప్రకంపనలు, ఆ పార్టీతో పాటు విప్లవ శిబిరాన్ని కుదిపేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఇప్పుడు మావోయిస్టు పార్టీలో వరుసగా దశలవారీగా జరుగుతున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర కమిటీ నాయకుల నేతృత్వంలో వందల సంఖ్యలో తుపాకులతో సహా ముఖ్యమంత్రుల ముందు లొంగిపోతున్న సంఘటనలే ప్రధానాంశంగా మారాయి. ప్రధాన స్రవంతి మీడియా కంటే సోషల్ మీడియాలో తాజా పరిణామాలపై విపరీతమైన చర్చ, అభిప్రాయాలు, భిన్నాభిప్రాయాలు హాట్ హాట్ గా సాగుతున్నాయి. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నేటి నక్సలైట్ ఉద్యమం వరకు ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టు, విప్లవ వాతావరణానికి ఉమ్మడి రాష్ట్రం, అందులో తెలంగాణ కేంద్రంగా ఉన్నది. కేంద్ర ప్రభుత్వం, బీజేపి ఎవరికి ఎన్ని ముద్రలు వేసినప్పటికీ తాజాగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం బాగా తగ్గిపోయినప్పటికీ ఆ రాజకీయ అభిప్రాయాలు, భావాలు, అభిమానులు, సానుభూతి పరులు, సమర్ధకులు, ఆశావాహుల సంఖ్య, నక్సలైట్లు ఉంటే అక్రమాలకు అడ్డుకట్టపడుతుందని వారు ఉండాలని కోరుకునే ఆకాంక్షవాదులు మొత్తంగా ఇలాంటి సమూహం ఇప్పటికీ తక్కువేమి లేదని చెప్పవచ్చు. అందుకే తాజా పరిణామాల ఆసక్తి కనబరుస్తున్నారు.

అక్కడ జరిగినా ఇక్కడ కేంద్రీకరణ

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మావోయిస్టు ప్రభావం ఒక విధంగా పూర్తిగా తగ్గి పక్కరాష్ట్రాలైన చత్తీస్ గడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఝార్కండ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో ముఖ్యంగా దండకారణ్యంలో మావోయిస్టు కార్యకలాపాలు జరుగుతున్న ఇప్పటికీ అక్కడ జరుగుతున్న సంఘటనలు, పరిణామాల ప్రభావం ఇక్కడ తీవ్రంగానే ఉంది. అక్కడ ఏం జరిగినా చెవులు రిక్కించి విన్నట్లుగా ఇక్కడ దానిపై చర్చ సాగుతోంది. గతంలో కంటే ఏడాది కాలంగా దండకారణ్యం లక్ష్యంగా కేంద్ర బలగాలు కగార్ పేరుతో చేస్తున్న ఈ కారణంగానే గత ఏడాది కాలంగా వందల సంఖ్యలో మావోయిస్టు ముఖ్యనాయకులు, కేడర్ ఎన్ కౌంటర్లలో మృత్యువాత పడ్డారు. చివరికి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావు అలియాస్ బస్వరాజు, కేంద్ర కమిటీ నాయకులు మోడం బాలకృష్ణ, గణేష్ , వివేక్, సోరేన్, చలపతి, కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణ రెడ్డితో పాటు రాష్ట్ర స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో మరణించారు. ఈ వరుస ఎన్కౌంటర్ల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేగింది. ముఖ్యంగా కర్రెగుట్టలాంటి సంఘటనల సమయంలో చర్చ తీవ్రమైంది. సంఘటనలు, ఎన్కౌంటర్లు పక్క రాష్ట్రాల్లో జరిగినా తెలంగాణ కేంద్రంగా శాంతి చర్చల డిమాండ్ తెరపైకి రావడమంటే ఇక్కడ ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజాందోళనలు చేపట్టారు. ఎన్ని రూపాల్లో ప్రయత్నించినప్పటికీ కేంద్రంలోని బీజేపీ సర్కారు చర్చలకు ససేమిరా అంటూ అణచివేతను తీవ్రం చేసింది. 2025 ఆరంభం నుంచి ఇప్పటివరకు 248 మంది మావోయిస్టులు మరణించారని గణాంకాలు చెబుతున్నాయి. 2024 నుంచి చూస్తే ఈ సంఖ్య 390కి చేరింది. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, జనవరి 2024 నుండి 2100 మంది నక్సలైట్లు లొంగిపోయారని..1785 మందిని అరెస్టయ్యారని, 477 మంది ఎన్ కౌంటర్ అయ్యారని వెల్లడించారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని తుడిచిపెట్టాలనే దృఢ సంకల్పానికి ఈ సంఖ్య అద్దం పడుతుందని తాజాగా అమిత్ షా పేర్కొన్నారు.

సాయుధ పోరాట విరమణ

చర్చల సందర్భంగా తెరపైకి అభయ్ తెచ్చిన ఆయుధాలు పక్కనపెట్టడం, సెప్టెంబర్ 17న సోనూ పేరులో వెల్లడైన 22 పేజీల లేఖలో కల్లోలం ప్రారంభమైంది. ఈ ప్రకటన పర్యవసానంగా తాజా లొంగుబాట్లకు దారితీసింది. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోనూ అలియాస్ వేణుగోపాల్ రావు నాయకత్వంలో మహారాష్ట్ర సీఎం ముందు బుధవారం 61 మంది ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. అదే రోజు చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో 27 మంది తమ ఆయుధాలతో సరెండరయ్యారు. శుక్రవారం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న అలియాస్ తక్కెళ్లపల్లి వాసుదేవరావు, రూపేష్ సహా 208మంది మావోయిస్టులు శుక్రవారం చత్తీస్ గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులు ఆయుధాలు, పేలుడు సామాగ్రిని ప్రభుత్వానికి అప్పగించారు. దండకారణ్యం సబ్ జోనల్ బ్యూరో కార్యదర్శి రూపేష్‌అలియాస్ తక్కెళ్ళపల్లి వాసుదేవరావు, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు, మాడ్ డివిజన్ కార్యదర్శి రనిత, బస్తర్ డివిజన్ కార్యదర్శి రాజమన్,, 15మంది డివిజన్ కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. జగ్దల్పూర్‌లో జరిగిన లొంగుబాటు కార్యక్రమంలో మావోయిస్టులు 153 ఆయుధాలను సరెండర్ చేశారు. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు 36, 11 బీజీఎల్, 4 కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. 208 మందిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు.

ఇంటా బయట అగ్నిపరీక్ష

మావోయిస్టు పార్టీలో తాజా పరిణామాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయుధాలతో కేంద్ర బలగాలతో యుద్ధం చేసి బతికిబట్టకట్టే పరిస్థితి లేనందున అనివార్యమైన పరిస్థితుల్లో లొంగిపోతున్నారనే అభిప్రాయం ఉంది. లొంగిపోయే వారూ ఆయుధాలు అప్పగించడం పట్ల వ్యతిరేక భావన ఉంది. ఆయుధాల అప్పగింతను సెంటిమెంట్ గా చూసే వారు కొందరతై తాజా పరిస్థితుల్లో లొంగిపోయే వారికి అనివార్యపరిస్థితులున్నందునే ఆయుధాలు అప్పగించారని చెబుతున్నారు. ఈ కారణంగా వారిపై ఆరోపణలు, అనుమానాలు వ్యక్తం చేస్తున్నవారు. బస్తర్, మాడ్ లో తాజాగా నెలకొన్న పరిస్థితుల కారణంగానే ఆయుధాలతో లొంగిపోయేందుకు నాయకులు, కేడర్ సిద్ధమయ్యారని తాజాగా రూపేష్ వెల్లడించారు. ఇదిలా ఉండగా పార్టీలో భిన్నాభిప్రాయాలుంటే చర్చించి ఉమ్మడి నిర్ణయాన్ని అమలు చేయాల్సిన నేతలు లొంగుబాట పట్టడం శత్రువుకు ఉపయోగపడడమనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగానే కొందరు నిందాపూర్వక విమర్శలు చేస్తున్నారు. అయితే మాటలకు చేతలకు చాలా తేడా ఉంటదనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. తాజాగా సాగుతున్న ఈ లొంగుబాటు పర్వం మరికొంతకాలం సాగే అవకాశం ఉందంటున్నారు. లొంగిపోని వారిపై అమిత్షా చెప్పినట్లు కగార్ కార్యాచరణ సాగే అవకాశం ఉంటుందంటున్నారు. ఈ క్రమంలో పార్టీలోని నాయకత్వం ఇప్పుడు అత్యంత తీవ్రమైన అగ్నిపరీక్షను ఎదుర్కొంటోందని చెప్పవచ్చు. ఉన్న నాయకత్వాన్ని కాపాడుకోవడం,కేడర్ కు నమ్మకాన్ని కలిగిస్తూ కష్టకాలాన్ని దాటేందుకు అవసరమైన కార్యాచరణ అమలు చేయడం ప్రస్తుత స్థితిలో అంత సులభమైన అంశం కాదంటున్నారు. పదునైన రెండంచుల కత్తిపై సాము చేయడంగా అభివర్ణిస్తున్నారు. ఇంటాబయట తీవ్రమైన ఒత్తిడి నెలకొన్న తాజా పరిస్థితుల్లో పురోగమించడమో, సాగే యుద్ధంలో ప్రాణాలు కోల్పోవడమో తప్ప మరో మార్గంలేదంటున్నారు. తాజా పరిణామాల పై పార్టీ ఏ విధంగా స్పందిస్తుందనే చర్చకూడా సాగుతోంది.

## శాస్త్రీయ పురాతన పద్ధతుల్లో లీకేజీ నివారణ

సింహాచలం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలం ఆలయం పైకప్పు మరమ్మతు పనులను పురాతన శాస్త్రీయ విధానంలో చేపట్టడం వల్ల మరో 200 ఏళ్లపాటు లీకేజీ సమస్యలు ఉత్పన్నం కావని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో చేపడితేనే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. దేవాలయాల్లో ఇలాంటి పద్దతులే అవలంబిస్తారని గంటా అభిప్రాయపడ్డారు. పైకప్పు లీకేజీల నివారణ ప్రాజెక్టు పనులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు.

# నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యాలు

హైదరాబాద్,ఒకసారి న్యాయస్థానంలో నిందితుడి తరఫున న్యాయవాది అమోఘంగా వాదిస్తున్నారు. అంతలో ఆయనకు ఒక టెలిగ్రామ్ వస్తుంది. దాన్ని చదివి మడతపెట్టి కోటు జేబులో పెట్టుకుని వాదన కొనసాగించారు న్యాయవాది. వాదనలు ముగిసి న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నిందితుడు నిర్దోషిగా విడుదల అయ్యాడు. న్యాయవాదికి అది అత్యంత సంతోషం కలిగించాల్సిన విషయమే. కానీ ఆయన ఒక్కసారిగా విషాదంతో కుప్పకూలిపోయారు. ఎందుకంటే, తనకు వచ్చిన టెలిగ్రామ్‌లో భార్య మరణ వార్త ఉంది. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె బొంబాయిలోని ఆస్పత్రిలో ఉంది. అత్యవసరంగా ఆపరేషన్ చేసినా ప్రాణాలు దక్కలేదు. వార్త తెలిసి కూడా ఏమాత్రం తొణక్కుండా ఆయన వాదనలు పూర్తి చేశారు. ఒక నిర్దోషికి శిక్ష పడకుండా కాపాడారు. ఆ న్యాయవాది- సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్. మరొక సందర్భం... ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక పిల్లాణ్ని తల్లిదండ్రులు ఎంతో ఆందోళనతో ఆస్పత్రికి తీసుకువచ్చారు. అయితే అక్కడ ఉండాల్సిన వైద్యుడు అందుబాటులో లేరు. దాంతో వారు ఆవేశంతో సిబ్బందితో గొడవ పడ్డారు. విషయం తెలుసుకున్న వైద్యుడు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని ఆ అబ్బాయికి తగిన చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరో రోగిని చూడటానికి వెళ్లినందువల్లే ఆస్పత్రిలో అందుబాటులో లేకపోయానని ఆ బాలుడి తల్లిదండ్రులను క్షమాపణ కోరారు. ఆయన పేరు డాక్టర్ బి.సి.రాయ్. 'పేదలకు వైద్యం చేసి ఫీజు తీసుకోకుండా 'మీ గ్రామాభివృద్ధికి మీరు చేయగల సాయం చేయండి' అని చెప్పి పంపిన దయార్ద్ర హృదయుడు. తన ఆస్తినంతా ప్రజలకోసం రాసిచ్చిన మానవతావాది. పూర్తి పేరు బిధాన్ చంద్రరాయ్! ఆయన పుట్టినరోజు అయిన జులై ఒకటినే మన దేశంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. మహాత్మాగాంధీకి స్నేహితుడిగా, వ్యక్తిగత వైద్యుడిగా సేవలందించారు రాయ్. అనంతర కాలంలో పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రిగానూ పనిచేశారు. న్యాయవాదిగా, వైద్యుడిగా పైన చెప్పిన ఇద్దరూ తమ తమ వృత్తులకు అంకితమైనవారే. ఆ తరవాత ఇద్దరూ రాజకీయాల్లోకి వచ్చారు. న్యాయవాద, వైద్య వృత్తుల్లోనూ, రాజకీయ రంగంలోనూ రాణిస్తున్న వారెందరో ఉన్నారు. కానీ కొందరు మాత్రమే తమదైన వ్యక్తిత్వంతో నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తారు. ఏ హోదాలో ఉన్నా చిత్తశుద్ధితో, నిబద్ధతతో కర్తవ్య నిర్వహణ చేయాలని చెప్పడానికి నిలువెత్తు ఉదాహరణలుగా నిలిచారు కాబట్టే సర్దార్ పటేల్, బీసీ రాయ్ 'భారత రత్నా'లయ్యారు. సమున్నత లక్ష్యంతో పాటు వజ్ర సంకల్పం కూడా అవసరమనేవారు స్వామి వివేకానంద. జీవితానికి అర్థం అనేది వారి వారి జీవన విధానాలను బట్టి ఉంటుంది. మనిషిగా జీవిస్తూ, సాటి మనిషికి సాయం చేస్తూ, మంచి మనిషిగా ఎదిగినప్పుడే కదా జీవితానికి సార్థకత!

# జగన్ హయాంలో పోలవరం విధ్వంసం

విజయవాడ, జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టు విధ్వంసం అయిందని మ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు ప్రాణం పోశారని ఉద్ఘాటించారు. తిరుపూర్‌లో మీడియాతో మాట్లాడాడుతూ..వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం దీపావళి శుభవార్త చెప్పిందని పేర్కొన్నారు. నిర్వాసితుల కోసం కూటమి ప్రభుత్వం తాజాగా రూ.1,100 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఇదే ఏడాది జనవరిలో మరో రూ.1000 కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు. 16 నెలల్లోనే నిర్వాసితులకు రూ.2,100 కోట్లు తమ ప్రభుత్వంలో విడుదల చేశామని స్పష్టం చేశారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏపీలోని సాగునీటి ప్రాజెక్టులను విధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. రివర్స్ టెండరింగ్ పేరుతో మొత్తం పోలవరం ప్రాజెక్టుని వరదల్లో ముంచేశారని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఎందుకు కేటాయించలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ అసమర్థత కారణంగానే డయాఫ్రం వాల్ దెబ్బతిందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు వెల్లడించారని గుర్తుచేశారు. పోలవరం పూర్తికాకుండానే కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నీళ్లు ఇస్తున్నట్లు జగన్ డ్రామా ఆడారని ఎద్దేవా చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేసి జగన్ నవ్వులపాలయ్యారని సెటైర్లు గుప్పించారు. అక్రమ ఇసుక దందా కోసం అన్నమయ్య ప్రాజెక్టును వరదల్లో ముంచేసి... 42 మంది ప్రాణాలు తీశారన్ని ÷ర్ అయ్యారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసేలా తమ ప్రభుత్వంలో పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఇప్పటివరకు 86 శాతం పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సూపర్ హిట్ చేశామని నొక్కిచెప్పారు. ఏపీలోని యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# నిమ్స్‌లో వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి

హైదరాబాద్,నగరంలోని నిమ్స్ ఆసుపత్రి అనస్థీషియా వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి తీవ్ర కలకలం రేపుతోంది. మృతుడు బీఎస్సీ నర్సింగ్ చేస్తున్న నితిన్‌గా గుర్తించారు. గురువారం విధులకు హాజరైన నితిన్.. శుక్రవారం ఉదయం ఆపరేషన్ థియేటర్లో విగతజీవిగా పడి ఉన్నాడు. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చనిపోయిన విద్యార్థి నిమ్స్‌లో న్యూరో సర్జరీ ఆపరేషన్ థియేటర్ అనస్థీషియా టెక్నీషియన్‌గా ఉన్నారు. నిమ్స్‌లోనే బీఎస్సీ నర్సింగ్ చేస్తున్నాడు. అయితే మరికొద్ది రోజుల్లో ఇంటర్నెట్ షిప్ పూర్తవుతుందనుకున్న సమయంలో నితిన్ ఇలా చనిపోవడం సహచరులను షాక్‌కు గురిచేసింది. బోరబండలోని గవర్నమెంట్ హాస్టల్లో ఉంటూ నిమ్స్‌లో నితిన్ ఇంటర్న్ షిప్ చేస్తున్నాడు. అయితే రాత్రి విధులకు హాజరైన నితిన్ అర్ధరాత్రి కనిపించకుండాపోయాడు. ఉదయానికి ఆపరేషన్ థియేటర్‌లో డోర్ వెనకాల అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. నితిన్‌ను గమనించిన హౌస్ కీపింగ్ సిబ్బంది వెంటనే నిమ్స్ సిబ్బందికి తెలియజేశారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఘటనా స్థలి నుంచి తరలించారు. కాజ్ ఆఫ్ డెత్‌పై పోలీసులు విచారణ చేపట్టారు. అలాగే అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించడం మొదలుపెట్టారు. నితిన్ ఆఖరి సారిగా ఎవరితో మాట్లాడాడు అనే దానిపై అతడి ఫోన్ కాల్ డేటాను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు నితిన్ మృతిపై నిమ్స్ యాజమాన్యం కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులకు పూర్తిగా సహకారం అందిస్తామని యాజమాన్యం ప్రకటించింది. ఇక నితిన్ మృతితో తోటి విద్యార్థులు, సీనియర్ వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఉప్పాడ మత్స్యకారుల జీవితాల్లో మార్పు

అమరావతి,ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారుల జీవితాల్లో మెరుగైన మార్పులు తీసుకు రావడానికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు.. మత్స్య సంపద పెంపొందించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మత్స్యకారుల సమస్యలపై శుక్రవారం) పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో వంద రోజుల ప్రణాళిక అమలుపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో పాటు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ), విశాఖపట్నం శాస్త్రవేత్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ చర్చించారు. మత్స్యకారుల్లో చేపల వేట సామర్థ్యాన్ని మరింత పెంపొందించడానికి గల అవకాశాలు, మత్స్యకారులకు అదనపు ఆదాయం సముపార్జనకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల కాకినాడ పర్యటన సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు తమ సమస్యలని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి వందరోజుల ప్రణాళిక చేపట్టారు. ఈ ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై ఈ సమీక్షలో చర్చించారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో సదుపాయాలు కల్పించడంతోపాటు వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ఉన్న అవకాశాలని అన్వేషించాలని సూచించారు. ముఖ్యంగా చేపల వేటలో మెలకువలు నేర్పడం, నైపుణ్యం పెంచడంతోపాటు తగిన సౌకర్యాల కల్పనపైనా దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. వీటితోపాటు మత్స్య సంపదను పెంపొందించడం, తదితర అంశాలపై విశాఖపట్నం సీఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్ కె. కిజాకుడాన్ సలహాలు, సూచనలు తీసుకున్నారు. యన సూచనలను అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కాకినాడ జిల్లా కలెక్టర్‌కి పవన్ కల్యాణ్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ బిందు మాధవ్, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

# కరుగుతున్న కొండ..

వరంగల్, వరంగల్ కాంగ్రెస్‌లో రాజకీయ కుంపటి రగులుతూనే ఉంది. వరుసగా జరుగుతున్న పరిణామాలు మరింత రోత పుట్టిస్తున్నాయి. తాజా పరిణామాల వెనక ఉన్నది సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డేనని కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఆరోపించారు. తమపై రెడ్డికులాల ఆధిపత్యం రదుస్తోందని ఆమె ఘాటుగానే వ్యాఖ్యానించారు. వీరంతా కలసి తమ కుటుంబాన్ని టార్గెట్ చేశారని మండుతున్నారు. తమది కాంగ్రెస్ రక్తమని చెప్పుకుంటున్న కొండా సురేఖ మధ్యలో కొన్ని సంవత్సరాలు మాత్రం బీఆర్ఎస్‌లో కొనసాగారు. ఈ క్రమంలో టీడీపీలో పనిచేసి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు తమను టార్గెట్ చేశారని కొండా సురేఖ ఆరోపిస్తున్నారు.వీరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్ని విధాలా సహకరిస్తున్నారని గాంధీభవన్ వేదికగా ఆరోపించారు. ఇదే విషయమై అప్పటి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వరకు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే వరకు ఫిర్యాదు చేస్తూ వచ్చారు. మరోవైపు, కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావుకు వ్యతిరేకంగా కూడా ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. నిత్యం వార్తల్లో ఉండటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, తమది మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ అని చెప్పడం, గల్లీ నుంచి ఢిల్లీ దాకా పరిచయాలు ఉండడం, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పేరుపెట్టి పిలిచే నాయకురాలిగా పేరు తెచ్చుకోవడంతోపాటు, చెప్పినట్టు వినరనే కారణంతో కొండా దంపతులను రేవంత్‌రెడ్డి టార్గెట్ చేశారని వీరు ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి నటుడు నాగార్జున అంశంలోనే సురేఖపై వేటు తప్పదన్న వార్తలు వినిపించాయి. అప్పట్లో ఆమెను తప్పించాల్సిందేనని వైరివర్గం అధిష్ఠానానికి ఫిర్యాదు కూడా చేసింది. ఈ ఫిర్యాదుల వెనక కూడా రెడ్డి సామాజికవర్గమే ఉన్నదని, రేవంత్‌రెడ్డి అండ చూసుకుని తమను వేధిస్తున్నారని అప్పట్లో కొండా దంపతులు ఆరోపించారు. ఇక గనలు వ్యవహారానికి వస్తే .. అక్రమాల నేపథ్యంలో దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి రూ.300 కోట్ల జరిమానా విధిస్తూ రాష్ట్ర పర్యావరణ శాఖ నోటీసులు పంపింది. ఆ నోటీసులతో బిత్తరపో యిన కంపెనీ యాజమాన్యం పలువురు ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకున్నట్టు సమాచారం. దీంతో బంతి తన కోర్టులోకి వచ్చిందని నిర్ధారించుకున్న ఓఎస్డీ సుమంత్.. కంపెనీ యాజమాన్యంతో బేరసారాలు చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో జరిగిన వ సూళ్ల, పంపకాల తేడాతో వ్యవహారం రచ్చకెక్కినట్టు చెప్తున్నారు. తాజా పరిణామాలపై సురేఖ కూతురు సుస్మిత సెల్ఫీవీడియో ద్వారా అందించిన వివరాలతో తీగ లాగితే హుజూర్‌నగర్‌లోని సున్నపురాయి నిక్షేపాల డొంక కదులుతున్నదని స్పష్టమవుతున్నది.కేసీఆర్ ప్రభుత్వ హయాం లో ఇదే అంశంపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తు జరిపారు. సుల్తాన్‌పూర్ రిజర్వు ఫారెస్టులో ఎన్‌సీఎల్ అనుమతికి మించి సున్నపురాయి నిక్షేపాలను తవ్వుతున్నట్టు దర్యాప్తులో తేలింది. ఆ నివేదికలోని సిఫారసు మేరకు రాష్ట్ర గనులు, భూ గర్భ శాఖ 2021లోనే ఆ కంపెనీకి రూ.91.42 కోట్ల జరిమానా కూడా విధించింది. అయితే తాజా ఈ-టెండర్లలో ఎన్‌సీఎల్ సరిగ్గా ఇదే బ్లాకుకు బిడ్ దాఖలు చేసి మైనింగ్ లీజు దక్కించుకోవడం గమనార్హం. కానీ మిగిలిన రెండు బ్లాకుల జోలికి వెళ్లలేదు.

# భూదాన్ భూములపై హైకోర్టు కీలక నిర్ణయం

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం భూదాన్ భూముల వ్యవహారం పై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ ను కొనుగోలు చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. సర్వే నెంబర్ 194, 195 భూదాన్ భూమిని అక్రమంగా మ్యుటేషన్ చేసి అన్యాక్రాంతం చేశారంటూ పిటిషనర్ తరఫున లాయర్ హైకోర్టు వాదించారు. అయితే పిటిషనర్ వాదనలను ధర్మాసనం ఏకీభవించలేదు. ఈ కేసులో ఇంప్లిడ్ పిటిషన్లు , ఇంటర్‌లోక్యుటరీ అప్లికేషన్ పిటిషన్లు కూడా హైకోర్టు కొట్టి వేసింది. మరోవైపు భూదాన్ భూముల వ్యవహారంలో ప్రధాన కేసు విచారణ మాత్రం కొనసాగుతూనే ఉంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని నాగారంలోని 181, 182 సర్వే నెంబర్‌లో సుమారు 103 ఎకరాలు భూదాన్ భూమి ఉంది. ఈ భూమిపై గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. అందులో సుమారు 50 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ 50 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో.. వారు అందులో ఎ÷-లాట్లుగా విభజించి.. విక్రయాలు చేపట్టారు. అయితే ఈ అంశం ప్రస్తుతం హైకోర్టు(÷ు్గ÷జీనిణజీనిజీ ఊతిణర అనీబీసబి) కోర్టు పరిధిలో ఉంది.

# అఫ్గాన్ - పాక్ సరిహద్దులో ఆగని రక్తపాతం

అఫ్గాన్ తాలిబాన్ బలగాలు, పాకిస్తాన్ సైన్యం మధ్య సరిహద్దులో జరిగిన తాజా రక్తపాతం దక్షిణాసియా వాతావరణాన్ని మరింత అస్థిరపరుస్తోంది. గత కొన్నేళ్లలో చూడని స్థాయిలో ఇరువైపులా తీవ్రమైన కాల్పులు జరిగి, సైనికులు, పౌరులు సహా డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. కాంధహార్ ప్రావిన్స్‌లోని స్పిన్ బోల్డక్, పాక్‌లోని చమన్ జిల్లాల మధ్య గల సరిహద్దు యుద్ధరంగంలా మారి, సైనిక బలగాల కాల్పులతో మార్మోగిపోయింది . అఫ్గాన్ వర్గాల ప్రకారం, పాకిస్తాన్ వైమానిక దాడుల్లో 12 మంది పౌరులు మరణించగా, 100 మందికి పైగా గాయపడ్డారు. దీనికి ప్రతీకారంగా తాలిబాన్ బలగాలు పాక్ సైన్యపు అవుట్‌పోస్ట్‌లను ఆక్రమించి, కొన్ని సైనిక ట్యాంకులను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించాయి. “మా బలగాలపై పాక్ సైన్యం లైట్ మరియు హెవీ వెపన్లతో దాడి చేసింది. ప్రతిదాడిలో పాక్ సైనికులు కూడా పెద్ద ఎత్తున హతమయ్యారు,” అని తాలిబాన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ప్రకటించారు. అఫ్గాన్ ప్రభుత్వం 58 మంది పాక్ సైనికులను హతమార్చామని ప్రకటించగా, పాక్ మాత్రం 200 మందికి పైగా అఫ్గాన్ సైనికులను చంపామని తెలిపింది.పాకిస్తాన్ మాత్రం ఈ ఆరోపణలను తిరస్కరించింది. ఆ ట్యాంకులు తమ సైన్యానికి చెందినవి కావని, అవి అఫ్గాన్ వద్ద ఉన్న పాత సోవియట్ ట్యాంకులు కావచ్చని రక్షణశాఖ మంత్రి ఖవాజా అసిఫ్ వివరణ ఇచ్చారు. అయితే, తాలిబాన్ విడుదల చేసిన వీడియోల్లో అఫ్గాన్ యోధులు పాక్ ట్యాంకులతో వీధుల్లో సంబరాలు చేసుకోవడం, కొంతమంది పాక్ సైనికుల మృతదేహాలను ప్రదర్శించడం వంటి దృశ్యాలు ప్రాంతీయ స్థాయిలో తీవ్ర చర్చలకు దారితీశాయి.

‘ప్యాంట్’ వివాదం పాక్ సైన్యానికి అవమానం

ఘర్షణలు తాత్కాలికంగా ఆగినా, పాకిస్తాన్ సైన్యానికి ఈ సారి తీవ్ర అవమానం మిగిలింది.తాలిబాన్ యోధులు పాక్ సైనికులు పారిపోయిన తర్వాత వారు వదిలి వెళ్లిన బట్టలు, ఆయుధాలను ప్రదర్శించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. బీబీసీ జర్నలిస్టు దావూద్ జున్బిష్ ఈ చిత్రాలను షేర్ చేస్తూ ౹ “పాక్ సైనికులు వదిలేసిన ఖాళీ ట్రౌజర్లు, రైఫిల్స్ ఇప్పుడు తాలిబాన్ బలగాల వద్ద ఉన్నాయి,” అని వ్యాఖ్యానించారు. అఫ్గాన్ ప్రజలు కూడా వీధుల్లోకి వచ్చి “మా సైన్యం దేశాన్ని కాపాడింది” అంటూ నినాదాలు చేశారు.ఈ ఘర్షణలు కొనసాగుతున్న వేళ, ఇరుదేశాలు చివరికి 48 గంటల కాల్పుల విరమణకు అంగీకరించాయి. పాక్ విదేశాంగ శాఖ “శాంతియుత పరిష్కారం కోసం ఈ విరమణ అవసరం” అని పేర్కొనగా, తాలిబాన్ మాత్రం “విరమణను కోరింది పాకిస్తానే” అని ప్రతిస్పందించింది. సౌదీ అరేబియా, ఇరాన్, ఖతర్ వంటి దేశాలు కూడా ఇరుదేశాలకు చర్చలు జరపాల్సిందిగా పిలుపునిచ్చాయి.అయితే, ఈ సరిహద్దు ఉద్రిక్తతలు కేవలం సైనిక ఘర్షణలు మాత్రమే కావు ౹ వాటి వెనుక రాజకీయ వ్యూహం కూడా ఉంది. ఇటీవల కాబూల్‌లో జరిగిన వైమానిక దాడిలో టిటిపి (తహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్) చీఫ్ నూర్‌వాలి మెహ్సూద్ లక్ష్యంగా ఉన్నారు. ఆయన జీవించి ఉన్నారో లేదో ఇంకా స్పష్టత లేదు. పాక్ సైన్యం ఈ దాడిని అంగీకరించకపోయినా, తాలిబాన్ ప్రభుత్వం దీనిని “పాక్ ఆక్రమణ చర్య”గా ఖండించింది. మెహ్సూద్ 2018లో టిటిపి నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ సంస్థ మళ్లీ బలపడింది. పాక్ భూభాగంలో దాడులు పెరగడంతో ఇస్లామాబాద్ అఫ్గాన్ ప్రభుత్వంపై పరోక్షంగా ఒత్తిడి తెస్తోంది. టిటిపి యోధులు అఫ్గాన్ భూభాగాన్ని ఆశ్రయంగా ఉపయోగిస్తున్నారని



పాక్ ఆరోపిస్తోంది. తాలిబాన్ మాత్రం దీనిని ఖండిస్తోంది.భారతదేశం కోణంలో ఈ పరిణామం అత్యంత ప్రాముఖ్యమైనది. నూతన భద్రతా సమీకరణల్లో కాబూల్, ఇస్లామాబాద్ మధ్య ఉన్న దూరం మరింత విస్తరిస్తే, ప్రాంతీయ సమతుల్యత భారత ప్రయోజనాలకు అనుకూలంగా మారే అవకాశం ఉంది. అదే సమయంలో, పాక్‌లో అంతర్గత అస్థిరత పెరగడం దక్షిణాసియా శాంతిపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం కూడా ఉంది. తాలిబాన్ శక్తి అఫ్గాన్ సరిహద్దులు దాటి ప్రభావం చూపే స్థాయికి చేరుకుంటే, ఇది పాక్‌కే కాకుండా భారత ఉత్తర సరిహద్దులకు కూడా సవాలుగా మారవచ్చు.ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతున్నా, అది తాత్కాలికమేనని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సరిహద్దు వద్ద సైనిక కదలికలు, డ్రోన్ పర్యవేక్షణలు కొనసాగుతున్నాయి. ఇరుదేశాల మధ్య నమ్మకం పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో ఏ చిన్న సంఘటన జరిగినా మళ్లీ యుద్ధ స్థాయి ఉద్రిక్తతలు తిరిగి చెలరేగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

భారత దృష్టికోణం: నిశితంగా పరిశీలిస్తున్న న్యూఢిల్లీ

ఈ సరిహద్దు రగడను భారతదేశం అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా తాలిబాన్ పాలన కింద అఫ్గానిస్తాన్ తిరిగి తీవ్రవాద శక్తుల స్థావరంగా మారుతుందనే ఆందోళన న్యూఢిల్లీకి ఉంది. ఇస్లామాబాద్-కాబూల్ మధ్య పెరుగుతున్న వైరం భారత్‌కు వ్యూహాత్మకంగా రెండు విధాలుగా లాభదాయకంగా ఉండొచ్చు ౹ ఒకవైపు పాక్ సైన్యం అంతర్గతంగా బలహీనపడే అవకాశం ఉంది, మరోవైపు అఫ్గాన్ పాలకులు భారత సహకారాన్ని అవసరమైన మిత్రుత్వంగా భావించే పరిస్థితి రావచ్చు. ఇప్పటికే తాలిబాన్ విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముత్తాఖీ ఇటీవల భారత్ పర్యటన చేసిన సందర్భంలో ఈ తాజా ఘర్షణలు కొత్త భౌగోళిక సమీకరణాలకు దారితీయవచ్చు.అయితే, ఈ పరిణామాన్ని భారత్ కేవలం వ్యూహాత్మక లాభం కోణంలో కాకుండా భద్రతా దృష్ట్యా కూడా గమనిస్తోంది. టిటిపి, ఐసిస్-ఖొరసాన్ వంటి సంస్థలు సరిహద్దుల ఆవలి నుంచి కార్యకలాపాలు విస్తరిస్తే, అది దక్షిణాసియా స్థిరత్వానికి తీవ్రమైన ప్రమాదం. అందుకే భారత నిఘా సంస్థలు, రక్షణ వ్యవస్థలు అఫ్గాన్ పరిణామాలను నిరంతరం సమీక్షిస్తున్నాయి. పాక్-అఫ్గాన్ వైరం తాత్కాలికంగా భారత్‌కు వ్యూహాత్మక సడలింపును ఇస్తున్నా, దీర్ఘకాలంలో కొత్త ఉగ్రవాద ముప్పులు తలెత్తకుండా సమతుల్య విధానం అవలంబించడం అవసరమని న్యూఢిల్లీకి తెలుసు.ఈ సరిహద్దు ఉద్రిక్తత పాక్ వైఫల్యానికి సంకేతమా, లేక దక్షిణాసియా నూతన శక్తి సమీకరణాల ఆరంభమా అన్నది రాబోయే వారాల్లో తేలనుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది ౹ కాబూల్ మరియు ఇస్లామాబాద్ మధ్య దూరం పెరిగే కొద్దీ, భారత దౌత్యం మరింత క్రమబద్ధంగా, తెలివిగా తన ప్రణాళికను ముందుకు తీసుకెళ్తోంది.

# రాహుల్ బాబు : మోడీకి ఫుల్ హ్యాపీయేనా ?



న్యూఢిల్లీ,గాంధీల వంశానికి రాజకీయంగా తిరుగులేదని ఈ దేశం ఎన్నో సార్లు నిరూపించింది. ఈ దేశానికి తొలి ప్రధానిగా నెహ్రూ ఏకంగా పదిహేడేళ్ళ పాటు పాలించారు. ఆయన కుమార్తెగా తండ్రి ఉండగానే రాజ్యసభకు నెగ్గిన వారు శ్రీమతి ఇందిరాగాంధీ. ప్రధాని నెహ్రూకి రాజకీయ కార్యదర్శిగా ఆయన మూడవ టెర్మ్ ప్రధానమంత్రిత్వంలో ఇందిరాగాంధీ రాజకీయంగా చురుకైన పాత్ర పోషించారు. నెహ్రూ మరణానంతరం లాల్ బహుదూర్ శాస్త్రి ప్రధాని అయితే ఆయన కేబినెట్ లో సమాచార శాఖ మంత్రిగా పనిచేశారు. కేవలం రెండేళ్ళు తిరగకుండానే 1966 జనవరిలో ఆమె ఈ దేశానికి ప్రధాని అయిపోయారు.

అత్యున్నత పీఠం అలా :

ఇక గాంధీల చరిత్ర చూస్తే అత్యున్నత పీఠం అయిన ప్రధాని పదవిని వారు అందుకోవడం అన్నది ఒక బిగ్ టాస్క్ గా ఎపుడూ మారలేదు. ఆ వరమాల వారి మెడలోకి అలా వచ్చిపడింది. అయితే తమ సమర్ధతను నిరూపించుకుని వారు పూర్తిగా ఆ బాధ్యతలతో నిరూపించుకున్నారు. పండిట్ నెహ్రూ 58 ఏళ్ళ వయసులో స్వతంత్ర్య భారతానికి తొలిసారి ప్రధాని అయ్యారు. ఇక ఇందిరాగాంధీ 49 ఏళ్ళ వయసులో ప్రధానిగా పగ్గాలు అందుకున్నారు. రాజీవ్ గాంధీ కేవలం నలభై ఏళ్ళకే ప్రధాని అయిపోయి ఈ దేశానికి యంగెస్ట్ పీఎం గా తిరుగులేని రికార్డుని స్థాపించి ఈ రోజుకీ దానిని అలాగే ఉంచగలిగారు.

రాహుల్ పొలిటికల్ కెరీర్ :

రాహుల్ గాంధీ పొలిటికల్ కెరీర్ చూస్తే ఆయన 2004లో రాజకీయ అరంగేట్రం చేశారు. మొదట్లో రాజకీయాల మీద ఆసక్తి లేదని ఆయన దూరంగా ఉన్నారని ప్రచారం సాగింది. ఆయన ఎంపీ అయిన నాటికి వయసు 33 ఏళ్ళు. ఒక విధంగా చూస్తే కాస్తా లేట్ అనే చెప్పాలి. ఇక 2004, 2009లలో కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీయే ప్రభుత్వాలు ఏర్పడి దశాబ్దం పాటు ఈ దేశాన్ని ఏలాయి. ఆ సమయంలో అయినా రాహుల్ గాంధీ కేంద్ర మంత్రిగా తొలి దఫాలో అప్పటి కాంగ్రెస్ ప్రధాని మన్మోహన్ సింగ్ వద్ద పనిచేసి ఉంటే 2009లో రెండవ టెర్మ్ లో కచ్చితంగా ప్రధాని అయి ఉండేవారు. అంతే కాదు తన ముత్తాత నాయనమ్మ తండ్రి బాటలో త్వరగానే అత్యున్నత పీఠం అందుకునేవారు. ఇంకా చెప్పాలి అంటే 2009లో రాహుల్ ప్రధాని అయి ఉంటే 38 ఏళ్ళకే పీఎం అయి తన తండ్రి రాజీవ్ గాంధీ రికార్డుని సైతం బద్దలు కొట్టేవారు. కానీ అలా జరగలేదు అంటే చేతిలో ఉన్న అవకాశాన్ని రాహుల్ గాంధె వాడుకోలేదనే అంతా అంటారు.

నాలుగు సార్లు ఎంపీగా :

రాహుల్ గాంధీ 2024 ఎన్నికల్లో దేశానికి ప్రతిపక్ష నాయకుడు అయ్యారు. ఆయన కెరీర్ లో ఇదొక మేలి మలుపు. ఒక విధంగా ప్రజాస్వామ్యంలో విపక్ష నేత అంటే వెయిటింగ్ ప్రైం మినిస్టర్ అని చెబుతారు. కానీ రాహుల్ ఆ విధంగా తన రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారా అంటే ఒకింత నిరాశనే కలుగుతోంది అని అంటున్నారు. ఆయన మోడీ మీద వేస్తున్న ట్వీట్లు చేస్తున్న విమర్శలు కూడా లాజిక్ కి అందకుండా ఉంటున్నాయి అని అంటున్నారు. ఒక సగటు నాయకుడు చేసే విమర్శలను గాంధీల వారసుడు, ప్రధాని కావాలని చూస్తున్న రాహుల్ గాంధీ చేయడం మీద కూడా చర్చ సాగుతోంది.

వ్యూహాల లేమితో :

మోడీని తక్కువ అంచనా వేస్తున్నారా లేక తనను తాను ఎక్కువగా ఊహించుకుంటున్నారా అన్నది తెలియదు కానీ రాహుల్ గాంధీ మాత్రం వ్యూహాల లేమితో సతమతం అవుతున్నారని అంటున్నారు. ఆయన ఈ రోజుకీ సీరియస్ పొలిటీషియన్ గా జనాల మెదళ్ళలో రిజిష్టర్ కాలేకపోతున్నారు అంటే తేడా ఎక్కడ ఉందో విశ్లేషించుకోవాలని కూడా అంటున్నారు. ప్రధాని మోడీ విషయం తీసుకుంటే ఆయన చేసే ప్రతీ విమర్శ వెనక ఒక వ్యూహం అర్ధం ఉంటాయి. మరి రాహుల్ లో అవి కనిపిస్తున్నాయా అన్నదే పెద్ద ప్రశ్నగా ఉంది.

ఈ లాజిక్ మరిచారా :

మోడీ ట్రంప్ కి భయపడుతున్నారు అని విపక్ష స్థానంలో ఉండి రాహుల్ ఎలా అనగలుగుతారు అన్నది ఒక డౌట్. ఎందుకంటే ట్రంప్ మీద దేశం మొత్తం ఆగ్రహంగా ఉంది. అధిక సుంకాలు విధించారని దేశ ప్రజలు అంతా గుర్రుగా ఉన్నారు. అలాంటపుడు అమెరికా పెద్దన్నకు మోడీ భయపడుతున్నారు అనడం ద్వారా రాహుల్ గాంధీ మోడీనే విమర్శించాను అని అనుకుంటున్నారు కానీ దాని వెనక దాగి ఉన్న భారతీయుల సెంటిమెంట్ ని ఏ విధంగా గుర్తించలేకపోతున్నారు అని అంటున్నారు. అందుకే ఆయన కామెంట్స్ బూమరాంగ్ అవుతున్నాయని అంటున్నారు. అమెరికన్ సింగర్ మేరీ మిల్బెన్ కూడా ఇపుడు రాహుల్ కామెంట్ మీద తనదైన విమర్శలు చేస్తూ అవి బాధ్యతా రాహిత్యం అని అంటున్నారు. ఇది వైరల్ అవుతోంది.

రాహుల్ హెల్ప్ చేస్తున్నారా :

దేశాధినేతగా కావాలనుకునే వారు ట్వీట్లు చేస్తూ లైట్ గా ప్రతీ ఇష్యూ మీద మాట్లాడుతూ ఉండరని అంటారు. దేశంలో ప్రజా సమస్యల మీద అధికార పార్టీని నిలదీయాలి. అదే సమయంలో దేశం బయట ఉన్న సమస్యల మీద ఆచీ తూచీ స్పందించాలి. కానీ రాహుల్ గాంధీ దేశం వెలుపల భారత దేశ నాయకత్వాన్ని విమర్శించాను అనుకుంటున్నారు. అనేక సార్లు ఆయన దేశ నాయకత్వం మీద విమర్శలు చేశారు. ఇది రాజకీయంగానే ఆయన ఆలోచిస్తునారు అన్న భావనను కలిస్తున్నాయి. అదే సమయంలో దేశ ప్రజలు కూడా వాటిని మెచ్చరని ఆయన గ్రహించలేకపోతున్నారు అని అంటున్నారు. ఈ తరహా అపరిపక్వతతో కూడా విమర్శల వల్ల రాహుల్ గాంధీ ప్రధాని మోడీకి ఎంతో హెల్ప్ చేస్తున్నారు అన్నది కూడా బీజేపీ వర్గాలలో ఉంది. అందుకే వారు రాహుల్ అపొజిషన్ లో తమకు ప్రత్యర్థిగా ఉండాలని కోరుకుంటున్నారు.

## కనకదుర్గమ్మకు కీర్తిలాల్ జ్యువెలర్స్ విరాళం

విజయవాడ,ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు రూ.2కోట్ల విలువైన వజ్రాలతో కూడిన బంగారపు ఆభరణాలను కానుకగా అందించారు. కీర్తిలాల్ జ్యూయలరీ నిర్వాహకులు సూర్య చంద్రుల ఆభరణాలు, ముక్కుపుడక, బులాకీ, బొట్టు, సూత్రాలు, గొలుసు, కంఠాభరణాలను దేవస్థానం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈవో శీనానాయక్‌లకు ఆలయ ప్రాంగణంలో ఇచ్చారు. 531 గ్రాముల బంగారం, వజ్రాలతో వాటిని తయారు చేయించారు.

# గుడ్ న్యూస్ అంటే ఇదే..

హైదరాబాద్,తెలంగాణ విద్యా వ్యవస్థలో మార్పు మార్క్.. పేదలకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సంస్కరణలపై దృష్టిసారించింది. విద్యాశాఖను నిర్వహిస్తోన్న సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా చూడాలన్నారు. ప్రతి స్కూల్‌లో తగినన్ని తరగతి గదులతో పాటు ప్లే గ్రౌండ్ ఉండాలన్నారు. కార్పొరేట్ స్కూల్‌కు ధీటుగా గవర్నమెంట్ స్కూల్‌ను తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు..ముందుగా ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ పై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించాలన్నారు. విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.నర్సరీ నుంచి 4వ తరగతి వరకు నూతన స్కూల్స్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చే ఏడాది.. 2026 జూన్ లో అకడమిక్ ఇయర్ నుంచి నూతన కార్యచరణ అమల్లోకి వచ్చేలా యాక్షన్ ప్లాన్ తో ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి, ఉన్నతాధికారులు.కాగా.. అంతకుముందు కూడా సీఎం రేవంత్ రెడ్డి నర్సరిని స్కూళ్లల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. నర్సరీ కోసం వేలు రూపాయలు సామాన్యులు ప్రైవేటు స్కూళ్లల్లో ఇచ్చి చదివిచ్చుకుంటున్నారని.. ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరి విద్యను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక పాఠశాలలతో సమాన్యులకు మేలు జరుగనుంది.

# ఆర్జిత సేవలకు ఆన్‌లైన్ లో విడుదల

తిరుమల, వచ్చే ఏడాది జనవరి నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల కోటా టికెట్లు, అంగ ప్రదక్షిణ టోకెన్లను ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందినవారు అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్లను ఈనెల 23న ఉదయం పది 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి ప్రకటించింది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా కూడా 23 మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్ అందుబాటులో ఉండనుంది. శ్రీవాని ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్ల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. శ్రీవారి ఆర్జిత, దర్శన టికెట్లను వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తితిదే ఓ ప్రకటనలో తెలిపింది.

# ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో అవార్డులు

న్యూఢిల్లీ,ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ ప్రతిభ కనబర్చి.. అవార్డులు సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సెక్రెటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ అవార్డులను స్వీకరించారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఆది కర్మయోగి జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్‌మన్, ఆది కర్మయోగి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామ స్థాయి అధికారులను రాష్ట్రపతి సత్కరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సన్మాన కార్యక్రమం జరిగింది. గిరిజన సాధికారత కార్యక్రమాలు - ఖఓ-ఏంఔఓంఔ, ఆది కర్మయోగి అభియాన్, జనభాగిరధి, ధర్తి ఆబా జన్ భగిదరి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖలు, అధికారులకు భారత రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. మూడో స్థానంలో నిలిచింది. అలాగే.. తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ పి.విని సూపర్ కోచ్‌లు/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్‌లలో ఒకరిగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా.గౌరవ్ ఉప్పల్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి పాటిల్, వెంకటేశ్ ధోత్రే లు, ఆదిలాబాద్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మత్, ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, ట్రైబల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల పాల్గొన్నారు.

# తిరుమల పరకామణి చోరీ కేసు

అమరావతి, తిరుమల పరకామణి చోరీ కేసుపై టిటిడి తీరుపై ఏపీ హైకోర్టు మరోమారు అసహనం వ్యక్తం చేసింది. శుక్రవారం దీనిపై హైకోర్టులో విచారణ జరిగింది. సీజ్ చేసిన ఫైళ్లు, ప్రాథమిక దర్యాప్తు నివేదికను ఉన్నత న్యాయస్థానానికి సీఐడీ సమర్పించింది. ఈ ఘటనపై కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తితిదే ఈవోపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తితిదే అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ నెల 27న ఈవో న్యాయస్థానం ముందు హాజరు కావాలని ఆదేశించింది. లేని పక్షంలో రూ.20 వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఘటనపై కౌంటర్ దాఖలు చేసేందుకు తితిదే సమయం కోరింది. ఇందుకు సమయమిస్తూ విచారణను ఉన్నత న్యాయస్థానం ఈ నెల 27కు వాయిదా వేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో 2023లో తిరుమల పరకామణిలో చోరీ కేసు నమోదైంది. ఈ ఘటనపై 2023లోనే తితిదే విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది. ఉద్యోగి రవికుమార్ పెద్దఎత్తున పరకామణిని కొల్లగొట్టారని అందులో పేర్కొన్నారు. దీనిపై అప్పటి తితిదే అధికారులు సమగ్ర దర్యాప్తు జరపకుండా లోకాయుక్తతో రాజీ చేయించారు. శ్రీనివాసులు అనే వ్యక్తి పిటిషన్ వేయడంతో హైకోర్టు విచారణకు స్వీకరించింది. మరోవైపు దీనికి సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం సీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో పరకామణిలో దస్త్రాలను సీఐడీ సీజ్ చేసింది.

# కొత్త బంగ్లాదేశ్ ఆవిర్భావం !



ఢాకా : 'జులై చార్టర్' గా పిలిచే జాయింట్ డిక్లరేషన్‌పై సంతకాలతో 'కొత్త బంగ్లాదేశ్' ఆవిర్భవించిందని తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ మహ్మద్ యూనస్ శుక్రవారం ప్రకటించారు. పార్లమెంట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నేతలు దీనిపై సంతకాలు చేశారు. దీంతో నూతన బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని యూనస్ వ్యాఖ్యానించారు. జులై ఫైటర్లకు దేశం రుణపడి వుందని యూనస్ వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని ఖలీదా జియాకి చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సహా 25 పార్టీలు దీనిపై సంతకాలు చేశాయని పత్రికా విభాగం తెలిపింది. ప్రభుత్వాన్ని నడిపేందుకు గానూ వివిధ రంగాల్లో 80కి పైగా సంస్కరణల సిఫార్సులను పొందుపరుస్తూ జాతీయ ఏకాభిప్రాయ కమిషన్ ఈ చార్టర్‌ను రూపొందించింది. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్, రాజకీయ పార్టీల మధ్య బృహత్తరంగా సాగిన చర్చల అనంతరం 'జులై చార్టర్'ను రూపొందించారు. అయితే బంగ్లాదేశ్ తాత్కాలిక నేత మహ్మద్ యూనస్‌కు కీలక మిత్రపక్షమైన నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి) విద్యార్థి విభాగం ఈ డాక్యుమెంట్‌పై సంతకాలు చేయబోమని తెలిపింది. ఈ డాక్యుమెంట్‌కు సరైన చట్ట ప్రాతిపదిక లేదంటూ ఈ సంతకాల కార్యక్రమాన్ని బహిష్కరించింది. జాతీయ ఏకాభిప్రాయం పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు ఈ డాక్యుమెంట్‌పై సంతకం చేస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నాయని ఎన్‌సిపి కన్వీనర్ నహీద్ ఇస్లామ్ విమర్శించారు. సంతకాల కార్యక్రమానికి కొద్ది గంటల ముందు యూనస్ నేతృత్వంలోని జాతీయ ఏకాభిప్రాయ కమిషన్ ఈ చార్టర్‌కు సవరణను తీసుకువచ్చినట్లు ప్రకటించింది. గతేడాది ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు సమయంలో వారు పోషించిన పాత్రకు గానూ జులై ఫైటర్లను గుర్తిస్తూ చార్టర్‌లోని ఒక క్లాజుకు సవరణ తీసుకువచ్చారు. ఎన్‌సిపిని బుజ్జగించేందుకే ఈ సవరించిన ముసాయిదాలో ఫాసిస్ట్ అవామీ లీగ్ అనే పదాలను చేర్చారు. కాగా ఈ చార్టర్‌లోని పలు ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధంగా వున్నాయని పేర్కొంటూ వీటిపై అసమ్మతిని వ్యక్తం చేస్తున్నామని అంతకుముందు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ వెల్లడించింది.

పార్లమెంట్ వద్ద ఆందోళనలు

'జులై చార్టర్' సంతకాల కార్యక్రమాన్ని నిరసిస్తూ వందలాదిమంది ఆందోళనకారులు అక్కడ ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరారు. వారిని అక్కడ నుండి వెళ్ళిపోవాల్సిందిగా కోరినా ఎవరూ అక్కడ నుండి కదలకపోవడంతో పోలీసులు లాఠీలతో రంగంలోకి దిగారు. బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు సమీపంలో మోహరించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలను, గ్రెనెడ్లను ప్రయోగించారు. లాఠీలు ఝుళిపించారు. గతేడాది ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వాన్ని గద్దె దింపిన నిరసనల్లో గాయపడిన వారికి చట్టపరమైన రక్షణ కల్పించి, వారికి పునరావాసం కల్పించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. నిరసనకారులు అక్కడ గల రెండు పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. ఎంపీల భవనం ముందు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ రూమ్‌ను, కంట్రోల్ రూమ్‌ను, ఫర్నిచర్‌ను తగలబెట్టారు.

# కనీస పెన్షన్ పెంపు ఎప్పుడు.?

న్యూఢిల్లీ : కనీస పెన్షన్ పెంపు ఎప్పుడు జరుగుతుందని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఇపిఎఫ్‌ఓ) పింఛనుదారులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల జరిగిన ఇపిఎఫ్‌ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ (సిబిటి) సమావేశంలోనూ దీనిపై నిర్ణయం తీసుకోకపోవడంపై పెన్షన్‌దారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రధాన డిమాండ్లను మరోసారి పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇపిఎస్–95 పథకానికి చెందిన వేలమంది పెన్షన్‌దారులు ఎప్పటినుంచో కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రూ. 1000గా ఉన్న నెలకు కనీస పెన్షన్‌ను రూ.7,500 పెంచాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో ఈ అంశం చర్చకు వస్తుందని అంతా భావించారు. కానీ, దీనిపై ఎలాంటి నిర్ణయమూ వెలువడకపోవడంపై అంతా నిరాశ వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల జరిగిన సిబిటి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఎఫ్ పాక్షిక విత్‌డ్రాకు సంబంధించిన 13 సంక్లిష్టమైన నిబంధనలను సీబీటీ ఒకే నిబంధనగా క్రమబద్ధీకరించింది. మూడు రకాలుగా.. 'ముఖ్యమైన అవసరాలు' (అనారోగ్యం, విద్య, వివాహం), 'గృహ అవసరాలు', 'ప్రత్యేక పరిస్థితులు'గా వర్గీకరించింది. ఇకపై చందాదారులు తమ పీఎఫ్‌లోని ఉద్యోగి, యజమాని వాటా సహా పీఎఫ్ నిధిలో అర్హమైన బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. అలాగే విత్‌డ్రా లిమిట్స్ కూడా పెంచింది. చదువు కోసం 10 సార్లు, వివాహం విషయంలో 5 సార్లు వరకు పాక్షిక విత్‌డ్రా చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ రెండింటికీ మూడుసార్లే తీసుకొనేందుకు అనుమతి ఉంది. అన్ని పాక్షిక ఉపసంహరణలకు చందాదారుల కనీస సర్వీసును 12 నెలలకు తగ్గించింది. అయితే వీటిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ముందస్తు ఉపసంహరణలకు సంబంధించిన గడువును 2 నెలల నుంచి 12 నెలలకు పెంచడం, ఇపిఎస్ మొత్తం ఉపసంహరణకు వేచి ఉండే కాలాన్ని సైతం 2 నెలల నుంచి 36 నెలలకు సవరించడం, ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో 25 శాతం కనీస నిల్వలు ఉండాలన్న నిబంధన తీసుకురావడంపై చందాదారులు, ప్రతిపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఈ నిబంధనలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. 'ఇపిఎఫ్‌ఓ తీసుకొచ్చిన కొత్త నిబంధనలు చాలా క్రూరమైనవి. ముఖ్యంగా పెన్షనర్లు, ఉద్యోగం కోల్పోయిన వారికి తమ సేవింగ్స్ అందకుండా చేస్తున్నారు. ఉద్యోగం పోయిన వారు ప్రావిడెంట్ ఫండ్ కోసం ఏడాది పాటు



(ఇంతకుముందు 2 నెలలు) వేచి చూడాలి. పెన్షన్ నిధి అందుకోవాలన్నా మూడేళ్లు ఆగాలి. గతంలో ఇది 2 నెలలు మాత్రమే. 25 శాతం పీఎఫ్ సొమ్ము లాక్ అవ్వడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు. ఇది సంస్కరణ కాదు.. దోపిడీ! ప్రధాని మోడీ వెంటనే జోక్యం చేసుకుని సామాన్యుల జీవితాలతో చెలగాటం ఆడకుండా చూడాలి' అని కాంగ్రెస్ ఎంపి మాణికం ఠాగూర్ డిమాండ్ చేశారు. అలాగే, "ఒక ఉద్యోగి ఏదైనా కారణంతో ఉద్యోగం కోల్పోతే.. ఆ వ్యక్తి బిల్లులు, ఈఎంఐలు ఎలా చెల్లిస్తాడు? ఒకవేళ ఏడాది తర్వాత నిధిని తీసుకున్నా కేవలం 75 శాతం మాత్రమే ఉపసంహరించుకోగలడు. మిగిలిన 25 శాతం మొత్తం కోసం రిటైర్మెంట్ దాకా వేచి చూడాలి. తమ నిధులను ఉపసంహరించుకోలేకుండా చేస్తే మధ్యతరగతి వ్యక్తి మనుగడ ఎలా?" అని కూడా ప్రశ్నించారు. ఈ కొత్త నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షమా మహ్మద్ డిమాండ్ చేశారు. నిబంధనల సరళతరం పేరుతో కష్టపడి సంపాదించిన సొమ్మును దోచుకుంటున్నారని విమర్శించారు. 25 శాతం కనీస నిల్వ నిబంధన రిటైర్మెంట్ వరకు ఉపసంహరించుకునే అవకాశం ఇవ్వకపోవడం సరికాదని తప్పుబట్టారు. కాగా, సిబిటి సమావేశంలో కనీస పెన్షన్ పెంపు అంశాన్ని చర్చించకపోయినప్పటికీ.. ఈ అంశం కేబినెట్ పరిశీలనలో ఉందని కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా వెల్లడించారు. సిబిటి అజెండాలో ఈ అంశం లేకపోయినప్పటికీ.. కార్మిక సంఘాల నేతలు ఈ అంశం లేవనెత్తడంతో ఆయన ఈవిధంగా స్పందించారు. కేబినెట్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.

# ఎవరిది పై చేయి?

హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ చతురత ఉన్న నేతలు చంద్రబాబు, కెసిఆర్. రాజకీయ వ్యూహాలు రూపొందించడంలో ఎవరికి వారే సాటి. ఒక విధంగా చెప్పాలంటే రాజకీయ చదరంగం ఆడగలరు. కానీ ఈ ఆటలో చంద్రబాబు వ్యూహమే ఎక్కువగా పనిచేసింది. కెసిఆర్ ఆలోచన ఆ పార్టీని ప్రమాదంలో పెట్టింది. తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి పదవి ఇవ్వలేదని ఆగ్రహించి బయటకు వెళ్లిపోయారు కేసీఆర్. ఏకంగా తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేసి ఎన్నో రకాల ఇబ్బందులు పడి అధికారంలోకి రాగలిగారు. చంద్రబాబును ఇబ్బంది పెట్టగలిగారు. తెలంగాణలో టిడిపి లేకుండా చేశారు. కానీ ఇప్పుడు అదే టిడిపి ఏపీలో అధికారంలో ఉంది. కేంద్రంలో చక్రం తిప్పుతోంది. తెలంగాణలో సానుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకుంది. ఈ మొత్తం ఎపిసోడ్లో కెసిఆర్ కిందకు పడిపోయారు.

పనిచేసిన కెసిఆర్ వ్యూహం..

2023 వరకు కెసిఆర్ వ్యూహాలు పనిచేసాయి. ఏం చేసినా చెల్లుబాటు అయింది. కానీ గర్వం నెత్తికెక్కింది. ఏకంగా భారతీయ జనతా పార్టీని ఎదుర్కునేందుకు సిద్ధపడ్డారు. కేవలం 7, 8 ఎంపీలు ఉన్న పార్టీగా ఒక జాతీయ పార్టీని ఎదుర్కోవడం అంత ఈజీ కాదు. అలా చేయాలంటే మరో జాతీయ పార్టీ అవసరం. కానీ రాష్ట్ర రాజకీయ పరిస్థితుల దృష్ట్యా.. కాంగ్రెస్ పార్టీతో స్నేహం చేయలేకపోయారు. ఒంటరిగానే పోరాటం చేసి హీరోను అనిపించుకోవాలని చూశారు. అటు బీజేపీతో స్నేహం చెడిపోయింది. ఇటు కాంగ్రెస్ పార్టీకి శత్రువు అయ్యారు. కానీ చంద్రబాబు అలా కాదు. బిజెపి నుంచి బయటకు వచ్చి తప్పు చేశానని భావించారు. అదే బిజెపితో చెలిమి చేశారు. ఎన్డీఏతో మరింత బంధం పెంచుకున్నారు. అలాగని కాంగ్రెస్ పార్టీతో శత్రుత్వం పెంచుకోలేదు.



ఒకరికి ఇబ్బంది.. మరొకరికి ప్రయోజనం..

ఒక్క మాటలో చెప్పాలంటే తండ్రుల మాదిరిగానే కేటీఆర్, లోకేష్ లు ఇద్దరు తెలివైన వారే. కెసిఆర్ కొడుకుగా తన ముద్ర చాటుకున్నారు కేటీఆర్. అయితే అదే ఇప్పుడు ఆయనకు ఇబ్బందికరంగా మారింది. అయితే ఎన్నో ప్రతికూలతలను అధిగమించి తనను తాను ప్రూవ్ చేసుకున్నారు నారా లోకేష్. మంచి పరిణితి కనబరుస్తున్నారు. జాతీయస్థాయిలో సైతం గుర్తింపు పొందుతున్నారు. ఎలాగూ చంద్రబాబు పట్ల జాతీయస్థాయిలో సానుకూలత ఉంది. చంద్రబాబుకు మంచి పాలనా దక్షుడిగా పేరు ఉంది. ఆ పేరును చిరస్థాయిలో ఉండేలా లోకేష్ కృషి చేస్తున్నారు. చంద్రబాబు వారసుడుగా జాతీయస్థాయిలో ప్రమోట్ అవుతున్నారు. తండ్రికి మించి తనయుడిగా గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. కానీ కెసిఆర్ మాత్రం చంద్రబాబు మాదిరిగా ఆలోచించలేదు. రాజకీయ శత్రువులను పెంచుకుంటూ ముందుకు సాగారు. అది ముమ్మాటికి మైనస్.

# పాక్ కు పాయింట్ బ్లాంక్ లో బ్రహ్మోస్.. మరో సర్జికల్ స్ట్రైక్?!



న్యూఢిల్లీ, ఈ మధ్య అమెరికా అండ చూసుకొని పాకిస్తాన్ రెచ్చిపోతుంది. పాకిస్తాన్ దేశంలో విస్తారమైన వనరులను అమెరికా కంపెనీలకు కట్టబెట్టడం ఇటీవల విజయవంతంగా పూర్తయింది. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఇటీవల అమెరికాలో పర్యటించారు. ఆ సమయంలో పాకిస్తాన్ దేశంలో లభ్యమవుతున్న అరుదైన వనరులను తవ్వే బాధ్యత అమెరికా కంపెనీలకు అప్పగిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. అందువల్లే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆయనతో లంచ్ చేశారు. శ్వేత సౌధంలో ఏకాంతంగా మాట్లాడారు. ఆ తర్వాత పాకిస్తాన్ దేశాన్ని గొప్పగా కీర్తించారు. అమెరికా కంపెనీలు పాకిస్తాన్ దేశంలో అడుగుపెడితే చెప్పుకోవడానికి ఏమీ ఉండదు. ఎందుకంటే సామ్రాజ్యవాదానికి అమెరికా బలమైన ఉదాహరణ. అటువంటి అమెరికా పాకిస్తాన్లో అడుగుపెడితే.. ఏ ఒక్క సహజ వనరును కూడా వదిలిపెట్టకుండా తవ్వుకొని తీసుకెళ్తుంది. ఇంత బిచ్చం మొహం మీద వేసినట్టు.. పాకిస్తాన్ చేతిలో చిల్లర వేస్తుంది. అమెరికా కంపెనీలు వస్తుండడం.. ట్రంప్ నుంచి బలమైన వర్తమానం అందడంతో పాకిస్తాన్ ఆనందానికి అవధులు లేవు. అందువల్లే మనతో యుద్ధం చేస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. న్యూక్లియర్ బాంబులు ఉన్నాయని.. తమను రెచ్చగొడితే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని హెచ్చరిస్తోంది. అంతేకాదు సింధు నది మీద భారత్ కడుతున్న ప్రాజెక్టులను నేలమట్టం చేస్తామని వార్నింగులు కూడా ఇస్తోంది.. వీటికి సరైన స్థాయిలోనే భారత్ బదులు చెప్పింది. తిక్క తిక్క వేషాలు వేస్తే తోకలు కత్తరిస్తామని హెచ్చరించి. ఇంకోసారి ఇలాంటి లేకి మాటలు మాట్లాడితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని గట్టు స్వరంతోనే కౌంటర్ ఇచ్చింది. అయితే ఇప్పుడు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాకిస్తాన్ కు మరోసారి గట్టి హెచ్చరికలు పంపారు. ఈసారి ఏకంగా భస్మీ పటలం చేస్తామని డెడ్లీ వార్నింగ్ ఇచ్చారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో రూపొందించిన తొలి విడత బ్రహ్మోస్ మిసైల్స్ ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. "పాకిస్తాన్లోని ప్రతి అంగుళం మా బ్రహ్మోస్ మిసైల్స్ రేంజ్ లోనే ఉంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా బ్రహ్మోస్ రేంజ్ ఏమిటో ప్రపంచానికి తెలిసింది. ఆపరేషన్ సిందూర్ అనేది ట్రైలర్ మాత్రమే. దానిద్వారా మన శత్రువుకు సత్తా ఏమిటో చూపించాం. పాకిస్తాన్ దేశానికి జన్మనివ్వగలిగిన ఇండియా.. అవసరమైతే ఏమైనా చేస్తున్నారని నిరూపించింది. అందువల్లే పాకిస్తాన్ ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉంటే మంచిది. అనవసరంగా మా దేశాన్ని గెలికితే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని" కేంద్ర రక్షణ శాఖ మంత్రి హెచ్చరించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి చేసిన హెచ్చరికల నేపథ్యంలో పాకిస్తాన్ దేశానికి మరో షాక్ తప్పదా అనే వార్తలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే పాకిస్తాన్ దేశం ఇప్పటికే అంతర్యుద్ధంతో ఇబ్బంది పడుతోంది. ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్ దేశానికి చుక్కలు చూపిస్తోంది. పాకిస్తాన్ సైనికులను దారుణంగా హతమార్చుతోంది. సరిహద్దుల వద్ద ఆఫ్ఘనిస్తాన్ భీకరంగా కాల్పులు జరుపుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో పాకిస్తాన్ దేశం పైకి భారత్ గనుక ఆపరేషన్ సిందూర్ లేదా సర్జికల్ స్ట్రైక్స్ ను చేపడితే పరిస్థితి మరో విధంగా ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ భారత్ లో భాగమయ్యే అవకాశాన్ని కొట్టి పారేయలేమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# కీలక ప్రాజెక్టులకు, చట్టాలకు హిందీ, సంస్కృతం పేర్లెందుకు పెడుతున్నారు




చెన్నై : దేశంలోని కీలకమైన ప్రభుత్వ ప్రాజెక్టులకు, చట్టాలకు హిందీ, సంస్కృతం పేర్లు పెట్టడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. కేంద్రం పాల్పడుతున్న ఈవిధమైన చర్యలపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని స్టాలిన్ అన్నారు. అవినీతిపరులైన వ్యక్తులు బిజెపి కూటమిలో చేరిన తర్వాత 'వాషింగ్‌మెషిన్'లో మరకలు పోయి తెల్లగా అయినట్లు.. వీరెలా అవినీతిమరకలు పోయి నీతిమంతులవుతారు? అని స్టాలిన్ ప్రశ్నించారు. దేశంలోని ముఖ్యమైన ప్రాజెక్టులకు, చట్టాలకు హిందీ, సంస్కృతంలో మాత్రమే పేర్లు పెట్టడం ఎలాంటి అహంకారం? కేంద్ర మంత్రులే మన పిల్లలకు శాస్త్రానికి విరుద్ధంగా మూఢనమ్మకాలను ఎందుకు బోధిస్తున్నారు? ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా గందరగోళం సృష్టించడం ద్వారా మీరు ఏమి సాధించాలనుకుంటున్నారా? అని స్టాలిన్ ప్రశ్నించారు. ఇటీవల ఇసి చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ పైనా ఆయన ప్రశ్నించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం కోసం ప్రజల ఓట్లను దోచుకునే ఓట్ల దొంగతనానికి ఎస్ఐఆర్ ఎందుకు మద్దతు ఇస్తుంది? తమిళనాడు శాస్త్రీయంగా నిరూపించినా.. దానిని ఎందుకు అంగీకరించడం లేదు? దానికెందుకు అయిష్టత చూపుతున్నారు? ఈ ఎస్ఐఆర్ నివేదిక ఓ కిలాడి నివేదిక. ఇది కిలాడి నివేదికను కాదని ఎందుకు ఎదురుదాడికి దిగుతున్నారు? వీటన్నింటికీ సమాధానాలు దొరుకుతాయా? లేదా? ఎప్పటిలాగే వాట్సాప్ విశ్వవిద్యాలయం ద్వారా తప్పుడు ప్రచారం చేయడం ప్రారంభిస్తారా? అని స్టాలిన్ కేంద్రంపై ప్రశ్నలు సంధించారు.

# సైదాబాద్ జువెనైల్ హోంలో లైంగికదాడి కలకలం..

హైదరాబాద్,హైదరాబాద్‌లోని సైదాబాద్ బాలుర జువెనైల్ హోమ్‌లో జరిగిన లైంగిక దాడి కేసు నెమ్మదిగా ఆందోళనకర విషయాలను వెలుగులోకి తీసుకొస్తోంది. హోంలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్న రహమాన్ అనే వ్యక్తి బాలురపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన, సెలవులపై ఇంటికి వెళ్లిన ఒక బాలుడు తల్లిదండ్రులకు చేసిన ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. ప్రారంభంగా 11 మంది బాలురు రహమాన్ చేతుల మీదుగా లైంగిక దాడికి గురైనట్లు అధికారులు గుర్తించారు. తాజా విచారణలో మరింత దిగ్భ్రాంతికరమైన విషయం బయటపడింది. మరో ఆరుగురు బాలురూ రహమాన్ బాధితులైనట్లు తేలడంతో, బాధితుల సంఖ్య 18కి పెరిగింది. హోంలో ప్రస్తుతం ఉన్న బాలురే కాక, గతంలో విడుదలైన బాలలపైనా దాడులు జరిగే అవకాశముందని అనుమానంతో, అధికారులు వారి నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు.

ఐదు పోక్సో కేసులు నమోదు మరిన్ని ఆరోపణల దిశగా దర్యాప్తు

ఇప్పటికే రహమాన్‌పై రెండు పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదయ్యాయి. అయితే తాజా ఫిర్యాదులతో కలిపి మొత్తం ఐదు కేసులు నమోదు చేశారు. పోలీసుల అనుమానాలను బలపరిచే విధంగా, సీసీ కెమెరా ఫుటేజ్‌లను స్వాధీనం చేసుకుని లోతైన విచారణ చేస్తున్నారు. బాధిత బాలల నుంచి కీలక సమాచారం



రాబడుతున్నారు. రహమాన్ గత కొన్ని నెలలుగా బాలులను బెదిరించి లైంగిక వేధింపులకు పాల్పడ్డట్లు స్పష్టమైంది. దాడులు ఎదుర్కొన్న బాలుర బాధనీ, హింసను విన్న పోలీసులు కూడా మానసికంగా కలత చెందుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రహమాన్ చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. అతన్ని కస్టడీలోకి తీసుకుని మరింత విచారణ చేయాలన్న దిశగా న్యాయ అనుమతికి పోలీసులు దరఖాస్తు చేశారు.

# జూబ్లీహిల్స్ లో మారుతున్న లెక్కలు.. కలిసొచ్చేదెవరికి..!!

హైదరాబాద్,జూబ్లీహిల్స్ బై పోల్ వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్నికలో గెలుపు మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారుతున్నాయి. ఇప్పటికే మూడు పార్టీల నేతలు ప్రచారం చేస్తున్నారు. ఇదే సమయంలో కొన్ని సంఘాలు తమ అభ్యర్థులను బరిలోకి దింపాలనే నిర్ణయం ఇప్పుడు పార్టీలకు సవాల్ గా మారుతోంది. టీడీపీ బరిలో లేకపోవటంతో ఎవరికి కలిసి వస్తుందనే అంచనాలు మొదలయ్యాయి. ఇప్పటికే స్థానిక సమీకరణాలు స్పష్టంగా ఉన్నాయి. గెలుపు పైనా క్రమేణా క్లారిటీ వస్తోంది. జూబ్లీహిల్స్ లో గెలుపు ఇప్పుడు అధికార కాంగ్రెస్ కు సవాల్ గా మారుతోంది. ఇక్కడ అభ్యర్థి విషయంలో సీఎం రేవంత్ తొలి నుంచి వ్యూహాత్మకంగా వ్యవహరించి.. నవీన్ యాదవ్ ను ఖరారు చేసారు. ఇదే సమయంలో ఎంఐఎం నిర్ణయం సైతం కీలకంగా మారింది. సామాజిక సమీకరణాల తో పాటుగా ప్రస్తుత పరిణామాలు తమకు అనుకూలంగా మారుతాయని కాంగ్రెస్ భావిస్తోంది. కాగా, ముగ్గురు మంత్రులకు జూబ్లీహిల్స్ బాధ్యతలు అప్పగించారు. పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. అటు బీఆర్ఎస్ సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తోంది. బీఆర్ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ ప్రచారంలోకి దిగారు. బీజేపీ నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రచారం కొనసాగిస్తున్నారు. ఇక.. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం కావడంతో ఉప ఎన్నికల్లోనూ తమ స్థానాన్ని నిలబెట్టుకోవాలని ఆ పార్టీ ప్రయత్నిస్తుంది. బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ హామీల విషయంలో మోసం చేసిందంటూ వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే బస్తీల్లో సభలు పెడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బుల్ డోజర్ వస్తుందంటూ కేటీఆర్ హెచ్చరిస్తున్నారు. ఇక.. బీజేపీ కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను సీరియస్ గా తీసుకుంది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ప్రచారంలో పాల్గొంటున్నారు. కిషన్ రెడ్డి ఎలాగైనా తన సన్నిహితుడైన దీపక్ రెడ్డిని గెలిపించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ టీడీపీ పోటీ చేయటం లేదు. 2023 లో ఆ పార్టీ



మద్దతుదారుల ఓటింగ్ కాంగ్రెస్ కు పోలయినట్లు విశ్లేషణలు ఉన్నాయి. ఇప్పుడు ఎవరికి కలిసి వస్తాయనే అంశం పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో, సర్వే నివేదికల ఆధారంగా పార్టీలు గెలుపు కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి.

## ఎంపిల నివాస సముదాయంలో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ,దిల్లీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఎంపీల నివాస సముదాయమైన బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్స్‌లో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు మంటలను అదుపులోకి తెచ్చాయి. రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రికి ఎదురుగా ఈ నివాస సముదాయం ఉంది. అనేక మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల నివాసాలు ఇందులో ఉన్నాయి. బాబా ఖరాగ్ సింగ్ మార్గ్‌లో ఉన్న బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్స్‌లో మంటలు చెలరేగినట్లు సమాచారం అందుకున్న అధికారులు.. 14 ఫైర్ ఇంజిన్లను అక్కడ మోహరించారు. దాదాపు గంటపాటు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నివాస సముదాయాన్ని

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com